విశాలాంధ్ర

ప్రకాశం

బాపట్ల

బుధవారం 24 జనవరి 2024 8 పేజీలు

బాలినేని భారీ ర్యాలీ - బల ప్రదర్శన

- ఒంగోలులో భారీ ర్యాలీ
- 24 వేల పట్టాల కోసం ప్రభుత్వం నుంచి డబ్బులు విడుదల
- ఎన్నికల్లోపే పేదలకు పట్టాలు ఇప్పిస్తా
- మీకోసం ఏ త్యాగాలకైనా సిద్ధం
- మాజీ మంత్రి బాలినేని

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : మాజీ మంత్రి, ఒంగోలు ఎమ్మెల్యే బాలినేని శ్రీనివాసరెడ్డి మరోసారి ఒంగోలు నగరంలో బల ప్రదర్శనకు దిగారు. ఒంగోలు నగర పరిధిలో 24 వేల మందికి నివేశన స్థలాలు ఇస్తేనే వచ్చే ఎన్నికల్లో పోటీ చేస్తానని గతంలో శబదం చేశారు. ఆ మేరకు ప్రభుత్వం నుంచి నిధుల విడుదల కోసం గత ఏడాది కాలంగా విశ్వ ప్రయత్నాలు చేశారు. చివరకు అధిష్టానంపైనే అలకబూనారు. పార్టీకే దూరమవుతున్నారన్న ప్రచారం జరిగింది. ఈ నేపథ్యంలో సీఎం జగన్మోహన్‌రెడ్డితో పలు దఫాలు కలిసినప్పటికీ అసంతృప్తిగానే ఉన్నారు. చివరకు గత నాలుగు రోజుల క్రితం ఒంగోలులో ఇళ్లపట్టాల కోసం స్థలాలు కొనుగోలు చేసి పంపిణీ చేసేందుకు అవసరమైన 200 కోట్ల రూపాయలను ప్రభుత్వం విడుదల చేసింది. దీంతో ఒంగోలు నుంచే బాలినేని కూడా రంగంలోకి దించేందుకు వైసీపీ నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. ఈ నేపథ్యంలో 20 రోజుల తరువాత ఒంగోలుకు బాలినేని తిరిగివస్తున్న సందర్భంగా వైసీపీ నాయకులు, బాలినేని అభిమానులు ఒంగోలు నగరంలో భారీ స్వాగత ఏర్పాట్లు చేశారు. ఒంగోలులో పేదలకు సొంతింటికల నెరవేర్చబోతున్న బాలినేనికి స్వాగతం అంటూ నగరం మొత్తం భారీ స్థాయిలో ఫ్లెక్సీలు ఏర్పాటు చేశారు. 200 కోట్లు ప్రభుత్వం నుంచి విడుదల కావడంతో ఒంగోలు నగరంలో బాలినేని తన సత్తా చాటుకునేందుకు బల ప్రదర్శనకు దిగారు. మంగళవారం సాయంత్రం నాలుగు గంటలకు హైదరాబాదు నుంచి ఒంగోలుకు చేరుకున్న బాలినేని శ్రీనివాసరెడ్డికి రాష్ట్ర మంత్రులు ఆదిమూలపు సురేష్, మేరుగ నాగార్జున, జడ్పీ చైర్‌పర్సన్ బూచేపల్లి వెంకాయమ్మ, మాజీ ఎమ్మెల్యే బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డితో పాటు పలువురు వైసీపీ ముఖ్య నేతలు స్వాగతం పలికారు. అనంతరం కర్నూలు రోడ్డు ఫ్లైఓవర్ నుండి ఆర్టీసీ బస్టాండ్, అద్దంకి బస్టాండ్, ట్రంక్‌రోడ్డు మీదుగా చర్చి సెంటర్ వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. చర్చిసెంటర్‌కు చేరుకున్న వైసీపీ కార్యకర్తలు, నాయకులను ఉద్దేశించి ప్రసంగించారు. అనంతరం కోర్టు సెంటర్, లాయర్ పేట మీదుగా తన నివాసానికి చేరుకున్నారు. ఈ సందర్భంగా బాలినేని మాట్లాడుతూ ఒంగోలులో ప్రజల కోసం ఇచ్చిన మాట నిలబెట్టుకునేందుకు తాను ఏ త్యాగానికైనా సిద్ధమన్నారు. గతంలో ప్రజలకిచ్చిన హామీ మేరకు సొంతింటి కల లేనివారికి నెరవేర్చాలనే దృఢ సంకల్పంతో ప్రభుత్వం నుంచి నిధులను రాబట్టడం జరిగిందని మిగతా 2 లో ...

వైసీపీలో ఐదవ జాబితాపై

ఉత్కంఠ

గిద్దలూరుకు చేగిరెడ్డి లింగారెడ్డి..?

- కనిగిరి కోసం 'బుర్ర' ప్రయత్నాలు
- ప్రత్యామ్నాయ స్థానం కల్పించాలంటున్న మద్దిశెట్టి
- అన్నారాంబాబు మళ్లీ ప్రయత్నాలు
- మార్కాపురానికి నాగార్జునరెడ్డి
- నేడు ప్రకటించనున్న ఐదవ జాబితా

చేగిరెడ్డి లింగారెడ్డి

విశాలాంధ్ర బ్యూరో-ఒంగోలు : అధికార వైసీపీ పార్టీలో ఐదవ జాబితాపై ఉత్కంఠ నెలకొంది. జిల్లాలో పెండింగ్‌లో ఉన్న గిద్దలూరు, ఒంగోలు, మార్కాపురం నియోజకవర్గాలకు సంబంధించి అభ్యర్థుల ఎంపికలో ఒంగోలు నుంచి బాలినేని శ్రీనివాసరెడ్డి, మార్కాపురం నుంచి కుందూరు నాగార్జునరెడ్డి పేర్లు దాదాపు ఖరారు అయినట్లే. గిద్దలూరు నుంచి చేగిరెడ్డి లింగారెడ్డి పేరు తెరమీదకు వచ్చింది. గిద్దలూరు వైసీపీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేయనని గతంలో ప్రకటించారు. ఈ సందర్భంగా వైసీపీ పార్టీ, నేతలపై పలు వ్యాఖ్యలు చేయడం విమర్శలకు దారితీసింది. ఈ నేపథ్యంలో గిద్దలూరు నుంచి బాలినేని శ్రీనివాసరెడ్డి రంగంలోకి దించాలని వైసీపీ అధిష్టానం ఆలోచించింది. చివరకు బాలినేని శ్రీనివాసరెడ్డిని ఒంగోలు నియోజకవర్గం నుంచి బరిలో దించి గిద్దలూరు నుంచి ఆయా నియోజకవర్గంలోని స్థానికులకే అవకాశం కల్పించాలని వైసీపీ అధిష్టానం నిర్ణయం తీసుకున్నట్లు సమాచారం. దీంతో ఆ నియోజకవర్గంలోని కంభం మండలం ఎర్రబాలెంకు చెందిన చేగిరెడ్డి లింగారెడ్డి పేరు తెరమీదకు వచ్చింది. వచ్చే ఎన్నికల్లో లింగారెడ్డి వైసీపీ మిగతా 2 లో ...

ప్రభుత్వ ప్రాధాన్య భవనాలను 31లోపు ప్రారంభించాలి

కలెక్టర్ దినేష్‌కుమార్

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : పూర్తయిన ప్రభుత్వ ప్రాధాన్య భవనాలను ఈ నెల 31 వ తేదీలోపు ప్రారంభించి పూర్తి స్థాయిలో వినియోగంలోకి తీసుకురావాలని జిల్లా కలెక్టర్ ఏ.ఎస్. దినేష్ కుమార్ అధికారులను ఆదేశించారు. మంగళవారం స్థానిక కలెక్టరేట్ నుండి అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై మండల స్థాయి అధికారులతో వీడియో కాన్ఫరెన్స్ ద్వారా సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రభుత్వ ప్రాధాన్య భవనాలైన సచివాలయాలు, ఆర్.బి.కె.లు, హెల్త్ క్లినిక్ నిర్మాణాలు పూర్తి అయి సంబంధిత శాఖలకు అప్పగించిన వాటిని స్థానిక ఎం.ఎల్.ఏ.. ఇతర ప్రజాప్రతినిధులతో ప్రారంభించాలన్నారు. కొత్త ఆరోగ్యశ్రీ కార్డుల పంపిణీని త్వరితగతిన పూర్తి చేయాలని ఆయన చెప్పారు. జగనన్న ఇళ్ల నిర్మాణాలను వేగంగా పూర్తి చేయాలని కలెక్టర్ అన్నారు. ఈ నిర్మాణాలలో స్పష్టమైన పురోగతి కనిపించాలన్నారు. జగనన్న ఇళ్లకు సంబంధించి లబ్ధిదారులకు పట్టాలు మంజూరు చేసినప్పటికీ వారు నిర్మాణాలు ప్రారంభించకపోతే భవిష్యత్తులో ఫ్రీహోల్డ్ అవకాశాన్ని నష్టపోతారని స్పష్టం చేశారు. ఈ విషయాలపై లబ్ధిదారులకు అవగాహన కల్పించాలని అధికారులను కలెక్టర్ ఆదేశించారు. ఉపాధిహామీ పథకంలో భాగంగా ఎస్.సి., ఎస్.టి. కుటుంబాలకు 100 రోజుల పనిదినాలను కచ్చితంగా కల్పించాలన్నారు. కమ్యూనిటీ సోక్ పిట్ల నిర్మాణం వేగంగా పూర్తి చేయాలన్నారు. రూఫ్‌టాప్ హార్వెస్టింగ్ పనులను కూడా త్వరితగతిన పూర్తయ్యేలా చర్యలు తీసుకోవాలని చెప్పారు. ఉపాధి హామీ పనులకు సంబంధించి ఆడిట్ లో గుర్తించిన నగదును వెంటనే రికవరీ చేసేలా ఎం.పి.డి.ఓ.లు దృష్టి పెట్టాలన్నారు. ఉపాధిహామీ పనులలో హౌసింగ్‌కు సంబంధించి 90 రోజుల పనిదినాలను లబ్ధిదారులకు కచ్చితంగా కల్పించాలన్నారు. జలజీవన్ మిషన్ క్రింద ప్రారంభించినఅన్ని పనులను త్వరితగతిన పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు.

నిజాయితీకి నిలువెత్తు రూపం ఎమ్మెల్యే కూనంనేని

- ఎమ్మెల్యే కూనంనేనికి ఘన సన్మానం
- స్వగ్రామం సంగుపాలం కోడూరులో కూనంనేనికి ఘన సన్మానం
- హాజరైన సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పలువురు ప్రముఖులు

విశాలాంధ్ర - బాపట్ల : తెలంగాణ రాష్ట్రం కొత్తగూడెం నియోజకవర్గ శాసనసభ్యులు సాంబశివరావు సన్మాన సభ స్వగ్రామం బాపట్ల జిల్లా పిట్టలవానిపాలెం మండలం సంగుపాలం గూడూరులో మంగళవారం రాత్రి అత్యంత వైభవంగా పండుగ వాతావరణంలో జరిగింది. సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ, మాజీ ఎమ్మెల్యే దూళిపాళ్ల నరేంద్ర కుమార్ పలువురు అతిథులు పాల్గొని కూనంనేని పేదల కోసం చేసిన త్యాగాలను కొనియాడారు.ఈ సందర్భంగా సిపిఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ మాట్లాడుతూ ప్రజలకు నిస్వార్ధంగా సేవ చేయడంలో కూనంనేని సాంబశివరావు ప్రత్యేక గుర్తింపు తెచ్చుకున్నారు.తన జీవితకాలంలో ఎంతోమందికి సేవ చేసి సేవే తన శ్వాసగా జీవితాన్ని గడుపుతున్నారని ఆయన కొనియాడారు. సిపిఐ పార్టీ తరపున కొత్తగూడెం ఎమ్మెల్యేగా కూనంనేని ఎన్నికవటం చాలా హర్షించదగ్గ విషయమని నీతివంతమైన ప్రజాప్రతినిధులకు సిపిఐ పార్టీ ఉంటుందనేది కూనంనేని నీతితోనే అర్ధమవుతుందన్నారు. కూనంనేని సాంబశివరావు ఊరిలో మాత్రమే కాదని ఊర్లు దాటి,జిల్లాలు దాటి, రాష్ట్రాలు దాటి,రెండు తెలుగు రాష్ట్రాలలో ఒకే ఒక్క కమ్యూనిస్టు శాసన సభ్యునిగా, యోధునిగా, పీడితజన పక్షపాతిగా, కార్మిక శ్రామిక వర్గాలకండగా అందరి మన్ననలు మిగతా 2 లో ...

బాలినేని భారీ ర్యాలీ – బల ప్రదర్శన

(మొదటిపేజీతరువాయి)

అన్నారు. ప్రజా సేవకే ఈ జీవితం అంకితమని తెలిపారు. రాజకీయంగా ఎన్ని విమర్శలు వచ్చినా ప్రజలు తనవెంటే ఉన్నారని వారి రుణం తీర్చుకోలేనిదని అన్నారు. బాలినేనికి ర్యాలీలో ఎక్కడికక్కడ వైసీపీ నేతలు ఘన స్వాగతం పలికారు. ర్యాలీలో పూలవర్షం కురిపించారు. గజమాలలు వేసి తిలకం దిద్ది గుమ్మడికాయలతో దిష్టి తీశారు. ర్యాలీ ముందు బాణసంచా పేల్చి తన అనందాన్ని చాటుకున్నారు. గత మూడు రోజుల క్రితం తెలుగుదేశం పార్టీ మాజీ ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్ పుట్టినరోజు వేడుకలు అత్యంత ఘనంగా జరుపుకొని వచ్చే ఎన్నికల్లో తానే గెలుస్తానన్న విధంగా బల ప్రదర్శన గావించారు. దానికి దీటుగా బాలినేని శ్రీనివాసరెడ్డి కూడా నగరంలో భారీ ర్యాలీ నిర్వహిఒచారు. పోటాపోటీగా తెలుగుదేశం, వైసీపీ నాయకులు బల ప్రదర్శనకు దిగడంతో రాజకీయంగా చర్చనీయాంశంగా మారింది. ఒక్కసారిగా ఒంగోలులో రాజకీయ వాతావరణం వేడెక్కింది.

నిజాయితీకి నిలువెత్తు రూపం ఎమ్మెల్యే కూనంనేని

(మొదటిపేజీతరువాయి)

అందుకుంటున్నారని తెలిపారు. మానవత్వం,సమానత్వాలను నమ్మారని వాటిని ఆధారం చేసుకుని రాజకీయాలను సాగిస్తున్నారన్నారు. కమ్యూనిస్టు రాజకీయాల్లో తెలుగువాడిగా తనదైన ముద్రను వేస్తున్నట్లు తెలిపారు. నమ్ముకున్న వారి కోసం ప్రత్యేకంగా వ్యవసాయ కూలీలు, పేద వర్గాలు, రైతాంగం, బడుగు బలహీనవర్గాలు,సింగరేణి కార్మికులు అభ్యున్నతి కోసం ఎల్లవేళలా శ్రమించినందునే రెండోసారి శాసనసభ్యునిగా ఎన్నికయ్యారన్నారు. కొత్తగూడెం ప్రజల గొంతుకుని అవుతానని చెప్పి, కొత్తగూడెం ప్రజలతో పాటు, తెలంగాణ ప్రజల ఆదరాభిమానాలను, అలాగే రెండు రాష్ట్రాల కమ్యూనిస్ట్ అభిమానుల,ప్రజల అభిమానంతో ప్రజా సమస్యల పట్ల తన గర్జించే గొంతుని దివిటిగా చేసి, పోరాటాలు చేస్తున్న కూనంనేనిని గ్రామస్తులంతా ఐక్యంగా అభినందన సన్మానం చేయటం ఎంతో ఆనందం అన్నారు.ఈ కార్యక్రమానికి సిపిఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి ముప్పాళ్ళ నాగేశ్వరరావు, మాజీ ఎమ్మెల్యేలు ధూళిపాళ్ల నరేంద్ర కుమార్, మంతెన అనంతరం రాజు,సిపిఐ జిల్లా కార్యదర్శి తన్నీరు సింగరకొండ, సిపిఐ సిపిఐ సీనియర్ నాయకులు జెబి శ్రీదర్ తదితరులు పాల్గొన్నారు.

పేదల పక్షపాతి కూనంనేని

విశాలాంధ్ర – బాపట్ల : పేదల పక్షపాతిగా కూనంనేని సాంబశివరావు పేరు తెచ్చుకున్నారని టిడిపి ఇంచార్జ్ వేగేశ్ నరేంద్ర వర్మ తెలిపారు. పిట్లవాని పాలెం మండలం కోడూరు గ్రామంలో తెలంగాణ రాష్ట్రం కొత్తగూడెం శాసనసభ్యులు కూనంనేని సాంబశివరావు సన్మాన సభ కార్యక్రమంలో నరేంద్ర వర్మ పాల్గొన్నారు.అనంతరం కూనంనేని సాంబశివరావుని దూశాల్వతో సన్మానించారు.

పూల సుబ్బయ్య వెలిగొండ ప్రాజెక్ట్ రెండో టన్నెల్లో మేఘా బ్రేక్ త్రూ

- విజయవంతంగా రెండో టన్నెల్‌ను పూర్తి చేసిన ఎంఈఐఎల్
- తొలి టన్నెల్‌ను 2021 జనవరిలో పూర్తి చేసిన మేఘా సంస్థ

విశాలాంధ్ర–పెద్దదోర్నాల : పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్ట్ రెండో టన్నెల్ లో మేఘా బ్రేక్ త్రూ మంగళవారం జరిగిందని వెలుగొండ ప్రాజెక్ట్ జనరల్ మేనేజర్ రాంబాబు మంగళవారం విలేకరులకు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ దీనితో ఈ ప్రాజెక్టులో రెండు టన్నెల్స్ నిర్మాణం చిన్న చిన్న పనులు మినహా పూర్తి అయినట్లే. టన్నెల్ బోరింగ్ మెషిన్ ద్వారా రెండు టన్నెల్స్ నిర్మాణాన్ని మేఘా ఇంజనీరింగ్ అండ్ ఇన్ఫ్రాస్ట్రక్చర్స్ లిమిటెడ్ (ఎం ఈ ఐ ఎల్) పూర్తి చేసింది. ఈ ప్రాజెక్ట్ టన్నెల్స్ తవ్వకం 15 సంవత్సరాల క్రితం ప్రారంభమైంది. 2020లో తోలి టన్నెల్ లో 3. 6 కిలోమీటర్లు, రెండో టన్నెల్ లో ఏడున్నర కిలోమీటర్ల పనులు చేపట్టిన ఎం ఈ ఐ ఎల్ విజయవంతంగా వాటిని పూర్తి చేసింది. టన్నెల్స్ తవ్వకాన్ని పూర్తి చేసిన అధికారులు కాంట్రాక్టు సంస్థ, సిబ్బందిని ప్రభుత్వం అభినందించింది. తొలి టన్నెల్ ను ఎం ఈ ఐ ఎల్ 2021 జనవరి నెలలో పూర్తి చేసింది. 13 నెలల్లోనే మూడున్న కిలోమీటర్ల తవ్వకం పనులు పూర్తి చేసి ఈ టన్నెల్‌ను పూర్తి చేసింది. తొలి టన్నెల్ పనులు ప్రారంభమైన 12 సంవత్సరాల తరువాత బ్రేక్ త్రూ ఐంది. రెండో టన్నెల్ లో ఏడున్నర కిలోమీటర్ల తవ్వకం పనులను టిబిఎం ద్వారా ఎంఈఐఎల్ మంగళవారం పూర్తి చేసింది. ప్రకాశం జిల్లా దోర్నాల సమీపంలోని కొత్తూరు నుంచి నల్లమల అటవీ ప్రాంతంలోని శ్రీశైలం ప్రాజెక్ట్ ఎగువ భాగంలోని కొల్లం వాగు వరకు రెండు టన్నెల్స్ తవ్వకం పనులను ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం లోని జల వనరుల శాఖ చేపట్టింది. తొలి టన్నెల్ ఏడు డయా మీటర్ల వ్యాసార్ధంతో, రెండో టన్నెల్ 9 . 2 డయా మీటర్ల వ్యాసార్ధంతో తవ్వాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఒక్కో టన్నెల్ పొడవు 18. 82 కిలోమీటర్లు. తోలి టన్నెల్ నుంచి మూడు వేల క్యూసెక్కులు, రెండో టన్నెల్ నుంచి 8500 క్యూసెక్కులు చొప్పున్ రోజుకు ఒక టి ఎం సి నీటిని తరలించేలా వీటిని డిజైన్ చేశారు. వై ఎస్ జగన్మోహన్ రెడ్డి నేతృత్వంలోని వై ఎస్ ఆర్ కాంగ్రెస్ ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత రెండు టన్నెల్స్ పనులు ఎం ఈ ఐ ఎల్ చేపట్టింది. తొలి టన్నెల్ పనులు చేపట్టిన 13 నెలల కాలంలో మిగిలిన 3. 6 కిలోమీటర్ల తవ్వకాన్ని ఎంఈఐఎల్ పూర్తి చేసి బ్రేక్ త్రూ సాధించింది. ఆ తరువాత రెండో టన్నెల్ పనులు ప్రారంభించి ఈ రోజు బ్రేక్ త్రూ సాధించింది. ఎం ఈ ఐ ఎల్. ఈ టన్నెల్స్ పూర్తి అయ్యి శ్రీశైలం జలాశయం నుంచి నీటి తరలింపు ప్రారంభము అయితే ప్రకాశం జిల్లాలోని పశ్చిమ ప్రాంతంతో పాటు, నెల్లూరు, కడప జిల్లా ప్రజలకు ఎంతో ప్రయోజనం చేకూరుతుంది. ప్రకాశం జిల్లాలో 3. 5 లక్షల ఎకరాలు, నెల్లూరు లో 80 వేల ఎకరాలు, కడప జిల్లాలో 30 వేల ఎకరాలకు సాగునీరు వెలుగొండ ప్రాజెక్ట్ వల్ల లభిస్తుంది. ఈ మూడు జిల్లాల్లోని 30 మండలాలకు చెందిన 16 లక్షల మంది ప్రజలకు తాగు నీరు అందుతుంది. వెలుగొండ టన్నెల్ లో ఆసియాలోనే అతిపెద్ద కన్వేయర్ బెల్ట్ ను ఉపయోగించారు. ఇది 39 మీటర్ల పొడవు ఉంది. టన్నెల్ తవ్వకం సమయంలో వచ్చే రాళ్లు, మట్టిని ఇది బయటకు తీసుకొస్తుంది. ఈ టన్నెల్స్ లో ఆడిటింగ్ లేకుండా పనులు పూర్తి చేశారు. ఏదైనా టన్నెల్ నిర్మించే సమయంలో ఆడిటింగ్ చేస్తారు. ఆడిటింగ్ అంటే టన్నెల్ ఉపరితల భాగం నుంచి ఒక రంధ్రం చేసి దాని ద్వారా ఏవైనా అత్యవసర సమయాల్లో యంత్ర సామాగ్రి, వస్తువులు, కార్మికులను తరలించేందుకు ఉపయోగించే మార్గం. ఈ అవకాశం లేకపోవటంతో ఎంఈఐఎల్ పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్ట్ టన్నెల్ పనులు చేపట్టిన తరువాత అనేక అవాంతరాలు ఎదుర్కొంది. ప్రాజెక్ట్ నిర్మాణానికి అవసరమైన ఇసుక, సిమెంట్, ఇనప సామాగ్రి, యంత్రాలను కర్నూల్ జిల్లా సంగమేశ్వరం నుంచి 125, 800 టన్నుల బరువును మోయగలిగే రెండు పంట్ల ద్వారా కొల్లం వాగు వరకు తరలించి, అక్కడి నుంచి వెలుగొండ ప్రాజెక్ట్ నిర్మాణ ప్రాంతానికి తరలించింది ఎంఈఐఎల్. ఈ సామాగ్రిని తరలించేందుకు పది గంటల సమయం పట్టేది. ప్రాజెక్ట్‌లో పనిచేసే సిబ్బందిని శ్రీశైలం డ్యామ్ నుంచి స్పీడ్ బోట్స్ ద్వారా తరలించింది. ఏదైనా అనుకోని సంఘటన జరిగినపుడు ప్రాజెక్ట్ నిర్మాణ ప్రాంతం నుంచి కార్మికులు సిబ్బందిని తీసుకురావాలంటే కనీసం రెండు గంటల సమయం పడుతుంది. టన్నెల్ లోపల పనిచేసే కార్మికులు 60 డిగ్రీల సెంటీగ్రేడ్ అంత వేడిని భరించాల్సి వచ్చేది. పనిచేసే కార్మికులు సిబ్బందికి అవసరమైన మంచినీటిని కూడా మరబోట్ల ద్వారా తరలంచాల్సిన క్లిష్టమైన పరిస్థితి నెలకొన్నా వాటన్నింటిని అధిగమించి ప్రాజెక్ట్ పనులు పూర్తి చేశామని పూల సుబ్బయ్య వెలుగొండ ప్రాజెక్ట్ ఎంఈఐఎల్ మేనేజర్ పీ. రాంబాబు తెలిపారు. ఈ ప్రాజెక్ట్ పనులు జరిగే ప్రాంతం అభయారణ్యంలో ఉంది. ఇక్కడ వన్యప్రాణులకు ఇబ్బంది కలిగించేలా ఎలాంటి పనులు చేపట్టకూడదు. ప్రతి రోజూ సూర్యోదయం నుంచి సూర్యాస్తమయం లోగానే పనులు చేపట్టాలి. ఆ తరువాత ఎలాంటి వాహన, యంత్ర కదలికలు ఉండకూడదు. ఈ ప్రాజెక్ట్ అంతా నీలం సంజీవరెడ్డి పులుల అభయారణ్యం పరిధిలో ఉండటమే దీనికి ప్రధాన కారణం. ఆ నిబంధలు పాటిస్తూనే ఎంఈఐఎల్ పనులు పూర్తి చేసింది. అదే సమయంలో ప్రపంచాన్ని గడగడలాడించిన కరోనా మహమ్మారి వల్ల పనులకు ఆటంకం కలగకుండా ప్రత్యేక చర్యలను ప్రభుత్వ సహకారంతో ఎంఈఐఎల్ తీసుకుంది. పనులు జరిగేలా చూసింది. ప్రతి సంవత్సరం వచ్చే భారీ వర్షాలు, వరదల ప్రభావం కూడా పనులపై పడకుండా ఎం ఈ ఐ ఎల్ చర్యలు చేపట్టింది. ఇదిలా ఉంటె జలవనరుల శాఖ వెలుగొండ టన్నెల్ బ్రేక్ త్రూ ప్రాంతాన్ని సందర్శించారు. ఆయన మాట్లాడుతూ కష్టతరమైన వెలుగొండ ప్రాజెక్ట్ పనులను ఇష్టంతో చేసి పూర్తి చేశామని అన్నారు. పులుల అభయారణ్యంలో ఈ ప్రాజెక్ట్ ఉన్నా అన్ని నిబంధనలు పాటించి పనులు పూర్తి చేశామని, వచ్చే సీజన్లో నీటిని ఈ టన్నెల్స్ ద్వారా విడుదల చేస్తామని తెలిపారు.

ఉత్కంఠ

(మొదటిపేజీతరువాయి)

తరపున బరిలో దించాలని అధిష్టానం నిర్ణయం తీసుకున్నట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. జిల్లా వ్యాప్తంగా గిద్దలూరుకు చేగిరెడ్డి పేరు ఖరారు అయినట్లు మంగళవారం ప్రచారం జరిగింది. లింగారెడ్డి 2009వ సంవత్సరంలో గిద్దలూరు నుంచి తెలుగుదేశం పార్టీ తరపున ఎమ్మెల్యే అభ్యర్థిగా పోటీ చేసి ఓడిపోయారు. ఆ ఎన్నికల్లో అన్నా రాంబాబు ప్రజారాజ్యం పార్టీ తరపున పోటీ చేసి విజయం సాధించారు. అనంతరం లింగారెడ్డి ప్రత్యక్ష రాజకీయాలకు కొంత దూరంగా ఉన్నారు. అయినా తన అనుచరులను కాపాడుకుంటూ వచ్చారు. ప్రస్తుతం గిద్దలూరు నియోజకవర్గం నుంచి వైసీపీ తరపున పోటీ చేసేందుకు తాను చేసే ప్రయత్నాల్లో భాగంగా ఆయన్నే బరిలో దించేందుకు వైసీపీ నిర్ణయం తీసుకున్నట్ల విశ్వసనీయ వర్గాల సమాచారం.

మళ్లీ అన్నా రాంబాబు ప్రయత్నాలు

గిద్దలూరు వైసీపీ ఎమ్మెల్యే అన్నా రాంబాబు వచ్చే సార్వత్రిక ఎన్నికల్లో పోటీ చేయనని ఇదివరకే ప్రకటించారు. గత 15 రోజుల నుంచి వైసీపీలో జిల్లా వ్యాప్తంగా చోటు చేసుకుంటున్న రాజకీయ పరిణామాల నేపథ్యంలో మరోసారి మళ్లీ వైసీపీ తరపున గిద్దలూరు నుంచి ఎమ్మెల్యేకు పోటీ చేయాలని నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు తన అనుచరులు మాజీ మంత్రి బాలినేని శ్రీనివాసరెడ్డి, విజయసాయిరెడ్డిని, సజ్జల రామకృష్ణారెడ్డిని కలిసి మాట్లాడారు. అన్నా రాంబాబు కూడా హైదరాబాదులో బాలినేని కలిశారు. మంగళవారం తాడేపల్లిలో ఉండి వైసీపీ ముఖ్యనేతలను కలిసి తనకు అవకాశం కల్పించాలని కోరినట్లు విశ్వసనీయ వర్గాల సమాచారం. ఇది జరుగుతుండగానే గిద్దలూరు నుంచి చేగిరెడ్డి లింగారెడ్డి వైసీపీ అభ్యర్థి అంటూ జోరుగా ప్రచారం జరుగుతుంది. చివరకు అన్నా రాంబాబు ప్రయత్నాలు ఫలిస్తాయా లేదా అనేది వేచి చూడాలి.

ఐదవ జాబితాపై ఉత్కంఠ

వైసీపీ అధిష్టానం ఇప్పటి వరకు వచ్చే ఎన్నికల్లో పోటీ చేసే ఆయా నియోజకవర్గాల సమన్వయకర్తల జాబితాను గత నాలిగింటిని ప్రకటించారు. ఐదవ జాబితాలో నేడో రేపో ప్రకటిస్తారని ఏరోజుకారోజు ప్రచారం జరుగుతుంది. ఈ జాబితాలో ప్రకాశం జిల్లాలో పెండింగ్‌లో ఉన్న మార్కాపురం, ఒంగోలు, గిద్దలూరు నియోజకవర్గాల అభ్యర్థుల పేర్లు ఉండే అవకాశం ఉన్నట్లు స్పష్టంగా తెలుస్తుంది. ఒంగోలులో బాలినేని, మార్కాపురంలో కుందూరు నాగార్జునరెడ్డి లైన్ క్లియర్ కాగా గిద్దలూరు ఒక్కటే పెండింగ్‌లో ఉంది. ప్రస్తుతం చేగిరెడ్డి లింగారెడ్డి పేరు మాత్రం గిద్దలూరు నుంచి బలంగా వినిపిస్తుంది.

బుర్ర, మద్దిశెట్టి ప్రయత్నాలు

దర్శి ఎమ్మెల్యే మద్దిశెట్టి వేణుగోపాల్, కనిగిరి ఎమ్మెల్యే బుర్ర మధుసూదన్ యాదవ్‌ను పక్కనపెట్టి దర్శి నుంచి బూచేపల్లి శివప్రసాద్‌రెడ్డిని, కనిగిరి నుంచి దద్దాల నారాయణ యాదవ్‌ను వైసీపీ అధిష్టానం ప్రకటించింది. దీంతో మద్దిశెట్టి వేణుగోపాల్, బుర్ర మధుసూదన్ యాదవ్‌లు రాజకీయంగా వైసీపీలో వారి పరిస్థితి ఏమిటనేది ప్రశ్నార్థకంగా మారింది. మద్దిశెట్టి ఒంగోలు పార్లమెంట్ టిక్కెట్ ఆశిస్తున్నప్పటికీ ఆ సీటును రెడ్డి కార్పొరేషన్ చైర్మన్ సత్యనారాయణరెడ్డికి ఇచ్చే అవకాశం ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది. బుర్ర మధుసూదన్ యాదవ్ వైసీపీ అధిష్టానం నిర్ణయాన్ని పున:పరిశీలించాలని దద్దాల నారాయణను కాదని తనకే టిక్కెట్టు ఇవ్వాలని గట్టిగా ప్రయత్నాలు చేస్తున్నారు. ఒకవేళ కనిగిరి ఇవ్వకపోతే చీరాల నియోజకవర్గానికి అవకాశం కల్పించాలని తన ప్రతిపాదనను పార్టీ ముందు పెట్టినట్లు సమాచారం.

ఘనంగా నారా లోకేష్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ యువ నాయకుడు నారా లోకేష్ జన్మదిన వేడుకలను మంగళవారం స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో ఘనంగా నారా లోకేష్ జన్మదిన వేడుకలు నిర్వహించారు. మండల తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షులు అంబటి వీరారెడ్డి, బట్టు సుధాకర్‌రెడ్డి, దేశ నాగేంద్రబాబు, ఈదర మల్లయ్య, దొడ్డ శేషాద్రి, చంటి, నాదెళ్ల సత్యనారాయణ, కొప్పుల వెంకట సుబ్బారెడ్డిలు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ స్థాపించి బడుగు బలహీన వర్గాలకు ఉండడానికి ఇల్లు తినడానికి తిండి కల్పించి తెలుగు ప్రజల ఆదర్శనీయమైన నాయకుడిగా గుర్తింపు తెచ్చుకున్న మహనీయుడు నందమూరి తారక రామారావు. ఆయన అల్లుడుగా పార్టీకి సేవలు అందిస్తూ కార్యకర్త క్షేమం కోసం అహర్నిశలు పాటుపడే తత్వం కలిగిన గొప్ప మేధావి మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ నాయకులు, శ్రీనివాస యాదవ్, షేక్ ఇస్మాయిల్, జెడి లక్ష్మయ్య, శీను, మండల టిడిపి నాయకులు,తదితరులు పాల్గొన్నారు.

పామూరులో: మండలంలోని కంబాలదిన్నె గ్రామంలో మంగళవారం టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి యువ నాయకులు నారా లోకేష్ జన్మదిన ఘనంగా నిర్వహించారు. ముందుగా ఎన్టీఆర్ విగ్రహం వద్ద కేక్ కటింగ్ చేసి లోకేష్ కి జన్మదిన శుభాకాంక్షలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మండల రైతు అధ్యక్షులు మన్నం రమణయ్య, గోళ్ళ వీరబాబు, కోలా కృష్ణమూర్తి, నియోజకవర్గ మహిళా ఉపాధ్యక్షురాలు ఓరుగంటి సుబ్బమ్మ, సురా గోవిందమ్మ, సోనుమూరి వెంకటేశ్వర్లు, గొల్ల కొండయ్య, గొల్ల రమేష్, గొల్ల చినమాల కొండయ్య, గొల్ల నరసింహులు, అడుసుమల్లి జయమ్మ, గొల్ల రమాదేవి మల్లెల శ్రీనివాసులు, కొమ్మలపాటి మదన్, కొమ్మలపాటి రామయ్య, కొమ్మలపాటి కొండలరావు, రాయి వెంకటస్వామి కొండా వెంకటేశ్వర్లు, సుంచు రామన్న, ఎర్ర సింగ్ శీను, దూదిపల్లి వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

పౌరులందరికీ సమాన హక్కులను రాజ్యాంగం కల్పించింది

ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె ఆంజనేయులు

విశాలాంధ్ర-తాళ్లూరు : భారత రాజ్యాంగం పౌరులందరికీ సాంఘిక, ఆర్థిక, రాజకీయ న్యాయాన్ని కల్పిస్తుందని ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కే ఆంజనేయులు అన్నారు. మండల కేంద్రమైన తాళ్లూరులోని ఊటుకూరు కోటయ్య ప్రభుత్వ జూనియర్ కళాశాల ఆవరణలో మంగళవారం దళిత బహుజన రిసోర్సెస్ సెంటర్ ఆధ్వర్యంలో ఏరియా కోఆర్డినేటర్ గోపన బోయిన వెంకట్రావు అధ్యక్షతన భారత రాజ్యాంగం విశిష్టత దాని మౌలిక లక్షణాలపై విద్యార్థిని విద్యార్థులకు అవగాహన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న ప్రిన్సిపాల్ కె ఆంజనేయులు మాట్లాడుతూ రాజ్యాంగంలో కుల ,మత, వర్గాలకు తావు లేకుండా అందరికీ సమానమైన అవకాశాలు, న్యాయాన్ని కల్పిస్తూ హక్కులు, బాధ్యతలను ప్రజలకు అప్పగించి అందరినీ సమానంగా గౌరవించడం జరుగుతుందని అన్నారు.

వైసీపీ జిల్లా బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి గుమ్మ యల్లేష్ యాదవ్

విశాలాంధ్ర-పెద్దదోర్నాల : వైసీపీ జిల్లా బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి గుమ్మ యల్లేష్ యాదవ్ మరియు మండల కన్వీనర్ గంటా వెంకట రమణారెడ్డి, ఆధ్వర్యంలో 50 టీడీపీ కుటుంబాలు మంగళవారం నియోజకవర్గంలో ఎర్రగొండపాలెంలో తెలుగుదేశం పార్టీ నుండి వైసిపి పార్టీలోకి 50 కుటుంబాలు చేరినట్టు, మండల నాయకులు వైసీపీ జిల్లా బీసీ సెల్ ప్రధాన కార్యదర్శి తెలిపారు. మండలంలోని టిడిపి కుటుంబాలు, వైసీపీ కండువా వేసి వైఎస్సార్సీపిలోకి ఆహ్వానించిన యర్రగొండపాలెం నియోజకవర్గ వైసీపీ ఎమ్మెల్యే అభ్యర్థి తాటిపర్తి చంద్రశేఖర్ వారికి పార్టీ కండువాలు కప్పి వైసీపీకి ఆహ్వానించారు. ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి చేస్తున్న సంక్షేమ పథకాలను చూసి పార్టీలోకి చేరినట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల కన్వీనర్ ఘంటా రమణరెడ్డి, జిల్లా మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి దోర్నాల వైస్ సర్పంచ్ రసూల్, మండల సచివాలయ, కన్వీనర్ గుండారెడ్డి, రమణారెడ్డి, కడపరాజుపల్లి సచివాలయ కన్వీనర్ గుండారెడ్డి కాశీరామిరెడ్డి, వార్డు మెంబర్ సుబ్బారెడ్డి. మరియు వైసీపీ నాయకులు మండల్ నాయకులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నారా లోకేష్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-ముండ్లమూరు : ముండ్లమూరులోని బస్టాండ్ సెంటర్లో ఉన్న మాజీ ముఖ్యమంత్రి దివంగత నేత నందమూరి తారక రామారావు విగ్రహం వద్ద తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో నారా లోకేష్ జన్మదిన వేడుకలు మంగళవారం ఎంతో ఘనంగా నిర్వహించారు. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు కూరపాటి శ్రీనివాసరావు మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ స్థాపించి బడుగు బలహీన వర్గాలకు ఉండడానికి ఇల్లు తినడానికి తిండి కల్పించి తెలుగు ప్రజల ఆదర్శనీయమైన నాయకుడిగా గుర్తింపు తెచ్చుకున్న మహనీయుడు నందమూరి తారక రామారావు. ఆయన అల్లుడుగా పార్టీకి సేవలు అందిస్తూ కార్యకర్త క్షేమం కోసం అహర్నిశలు పాటుపడే తత్వం కలిగిన గొప్ప మేధావి మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు. వీరిద్దరికి సరితూగే రీతిలో తెలుగుదేశం పార్టీకి ఉన్నటువంటి యువ నాయకులు నారా లోకేష్ 41 వ జన్మదిన వేడుకలు తెలుగుదేశం పార్టీ నాయకులు ఎంతో ఘనంగా కేక్ కట్ చేసి సంబరాలు చేశారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ మాజీ అధ్యక్షులు సోమేపల్లి శ్రీనివాసరావు, మాజీ జెడ్పిటిసి వరగాని పౌలు, శంకరాపురం సర్పంచి కూరపాటి మహేశ్వరి నారాయణస్వామి, వేముల సర్పంచి గజ్జెల సుబ్బారెడ్డి, పోలవరం గ్రామ పార్టీ అధ్యక్షుడు కొర్రపాటి బుచ్చిబాబు, సింగనపాలెం విద్యా కమిటీ చైర్మన్ కోయి శివ, బేతా కోటిరెడ్డి, కాటూరి గురవయ్య, చింతలపల్లి వెంకటస్వామి, కుమ్మెత పేరారెడ్డి, బరిగే రామ లక్ష్మయ్య, కందిమల్ల వెంకట సుబ్బయ్య, బాలయ్య, శేషయ్య, శీను, జిల్లెల మూడి చౌదరి పాల్గొన్నారు.

టీడీపీలోకి కొనసాగుతున్న వలసలు

విశాలాంధ్ర-పీసీపల్లి : పీసీపల్లి మండలంలో టిడిపిలోకి వలసలు కొనసాగుతున్నాయి నియోజకవర్గ ప్రజలు ఉగ్ర నాయకత్వాన్ని కోరుకుంటుండడంతో మండలంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మెల్లమెల్లగా ఖాళీ అవుతుంది వైసిపిలోనుండి తెలుగుదేశం పార్టీలోకి వలసలు ఊపందుకున్నాయి తాజాగా మంగళవారం తలకొండపాడు గ్రామంలో 20 కుటుంబాలు వైసీపీని వీడి టిడిపిలో చేరాయి. నియోజకవర్గ టీడీపీ ఇంచార్జ్ మాజీ ఎమ్మెల్యే ముక్కు ఉగ్ర నరసింహారెడ్డి వీరందరికి పార్టీ కండువాలు వేసి టీడీపీలోకి ఆహ్వానించారు. ఉగ్ర నరసింహారెడ్డి నాయకత్వంపై నమ్మకంతో టీడీపీలో చేరుతున్నట్లు వారంతా ప్రకటించారు. కనిగిరి నియోజకవర్గం నుండి తెలుగుదేశం పార్టీ అభ్యర్థి ఉగ్ర నరసింహారెడ్డిని ఎమ్మెల్యేగా అత్యధిక మెజారిటీతో గెలిపించుకొంటామని తెలియజేస్తున్నారు. రోజు రోజుకి చేరికలతో టీడీపీ ఆఫీస్ సందడిగా మారుతోంది. ఈ సందర్భంగా ఉగ్ర మాట్లాడుతూ రోజు రోజుకి టీడీపీకి ఆదరణ పెరుగుతుందన్నారు. నియోజక వర్గంలో చాలా గ్రామాల్లో ప్రజలు టీడీపీలో చేరడానికి ఆసక్తి చూపుతున్నా రన్నారు. కార్యక్రమంలో నియోజకవర్గ ముఖ్య నేతలు పిసీపల్లి మండల నాయకులు తెలుగుదేశం పార్టీ అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన ధీరుడు సుభాష్ చంద్రబోస్

విశాలాంధ్ర-కనిగిరి : బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన ధీరుడు స్వాతంత్ర సమరయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని కనిగిరి జెడ్పిటిసి మడతల కస్తూరిరెడ్డి తెలిపారు. మంగళవారం జడ్పిటిసి క్యాంపు కార్యాలయంలో సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను నిర్వహించారు. చంద్రబోస్ చిత్రపటానికి పూలమాలవేసి ఘనంగా నివాళులర్పించారు. దేశం కోసం సుభాష్ చంద్రబోస్ చేసిన సేవలను, పోరాటాలను కొనియాడారు. మూలే మాల కొండారెడ్డి, వైస్ ఎంపీపీ లక్కిరెడ్డి తిరుపతిరెడ్డి, గుడిపాడు సర్పంచ్ డి నాగేంద్ర రెడ్డి, జిల్లా రైతు సంఘం నాయకులు సూరసాని మోహన్ రెడ్డి ,వీరంరెడ్డి బ్రహ్మారెడ్డి, మాజీ ఎంపిటిసి మండాది కృష్ణారెడ్డి, ఎంపిటిసి మూలే గోపాల్‌రెడ్డి,మూలే గోపాల్ రెడ్డి, బాబు పాల్గొన్నారు.

జనసేన ఆధ్వర్యంలో లోకేష్ పుట్టినరోజు

విశాలాంధ్ర-ముండ్లమూరు : జనసేన పార్టీ ఆధ్వర్యంలో ముళ్ళమూరులోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మాజీ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తనయుడు తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ 41వ పుట్టినరోజు వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో రోగులకు బ్రెడ్, పండ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమం దర్శి నియోజకవర్గ జనసేన నాయకులు గరికపాటి వెంకట్ సారధ్యంలో జరిగాయి. ఈ సందర్భంగా దర్శి నియోజకవర్గ జనసేన నాయకులు గరికపాటి గోపి మాట్లాడుతూ తాతకు తగ్గ మనవడిగా, తండ్రికి తగ్గ తనయుడిగా పసుపు జెండా మోసే యువ నాయకులు నారా లోకేష్ అని అన్నారు. నేటి యువతరానికి ఆదర్శ నాయకుడిగా అధికారం అయినా, ప్రతిపక్షం అయినా నిత్యం ప్రజల వెంటే ఉంటున్న లోకేష్ రానున్న రోజుల్లో మరెన్నో జన్మదిన వేడుకలు నిర్వహించుకోవాలని ఆకాంక్షించారు. తెలుగుదేశం పార్టీని బలోపేతం చేయడంలో నారా లోకేష్ బాబు చురుకైన పాత్ర పోషిస్తున్నారని అన్నారు. ప్రజల సమస్యల పట్ల అన్ని రకాలుగా ప్రభుత్వంపై పోరాటాలు చేస్తున్నారని, రాబోయే 2024 లో చంద్రబాబు నాయుడును ముఖ్యమంత్రిగా చేయడంలో చురుకైన పాత్ర పోషించాలని కోరారు. ఈ కార్యక్రమంలో జనసేన కార్యకర్తలు అభిమానులు తదితరులు పాల్గొన్నారు.

దద్దాల నారాయణ ర్యాలీని విజయవంతం చేయండి

విశాలాంధ్ర-కనిగిరి : ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాలతో మాజీ మంత్రివర్యులు బాలినేని శ్రీనివాస్ రెడ్డి ఆశీస్సులతో కనిగిరి నియోజకవర్గ వైసిపి ఇన్చార్జిగా దద్దాల నారాయణను నియమించటం జరిగిందని వైసిపి సీనియర్ నాయకులు వీరంరెడ్డి బ్రహ్మారెడ్డి మంగళవారం తెలిపారు. బుధవారం ఉదయం 9 గంటలకు నందన మారెళ్ళ నుండి ర్యాలీగా విచ్చేసి కనిగిరి పవిత్ర కన్వెన్షన్ హాల్లో కార్యకర్తల పరిచయ కార్యక్రమం జరుగును. కావున కనిగిరి నియోజకవర్గం లోని వైయస్సార్ అభిమానులు, ప్రజాప్రతినిధులు ఎంపీటీసీలు, సర్పంచులు, వైఎస్ఆర్సిపి నాయకులు, కార్యకర్తలు, వైఎస్ఆర్ కుటుంబ సభ్యులందరూ హాజరుకావాలని కోరారు.

ఆసరా నిధులు విడుదల

విశాలాంధ్ర-కనిగిరి : వైఎస్ఆర్ ఆసరా 4వ విడత నిధులు అనంతపురం జిల్లా ఉరవకొండలో రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి మంగళవారం విడుదల చేశారు. కనిగిరి కాశిరెడ్డి కాలనీ సచివాలయంలో ప్రత్యక్షంగా వీక్షించిన ఛైర్మన్ అబ్దుల్ గఫార్ మాట్లాడుతూ ఇచ్చిన మాటను నిలబెట్టుకున్న ఏకైక ముఖ్యమంత్రి జగన్ మోహన్‌రెడ్డి అని కొనియాడారు. మహిళలకు ఇచ్చిన మాట బ్యాంకుల ద్వారా తీసుకున్న రుణాలను మొత్తం 4దఫాలుగా పూర్తిగా మహిళల ఖాతాల్లో వేసి మహిళల అదరాభిమానాలు గెలుచుకున్నాడన్నారు. ఈ కార్యక్రమములో వైసీపీ నాయకులు ఆర్పీలు లీలావతి, మహిళలు వార్డు ప్రజలు పాల్గొన్నారు.

స్వాతంత్ర్య సమయోధుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్

విశాలాంధ్ర-అద్దంకి : స్వాతంత్ర్య సమరయోధుడు నేతాజీ సుభాస్‌చంద్రబోస్ అని సాయుధ పోరాటం ద్వారానే ఆంగ్లేయులను దేశం నుంచి తరిమి కొట్టవచ్చునని నమ్మి ఆచరణలో పెట్టిన మహనీయుడు నేతాజీ సుభాస్‌చంద్రబోస్ అని పట్టణ వైసీపీ అధ్యక్షులు కాకాని రాధాకృష్ణమూర్తి అన్నారు. నేతాజీ సుభాస్ చంద్రబోస్ జయంతిని పురస్కరించుకొని మంగళవారం స్థానిక కొత్తపేటలో నేతాజీ చిత్ర పటానికి పలువురు ప్రముఖులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో వైసీపీ నేతలు పానెం నరశింహారెడ్డి, శ్రీనివాసరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాకాని హనుమంతరావు మృతికి సంతాపం

విశాలాంధ్ర-అద్దంకి : పట్టణ తెలుగుదేశంపార్టీ సీనియర్ నాయకులు కాకాని అశోక్ తండ్రి కాకాని హనుమంతరావు మంగళవారం గుండెపోటుతో హఠాన్మరణం చెందగా హను మంతరావు పార్థీవదేహానికి ఎమ్మెల్యే గొట్టిపాటి రవికుమార్ పూలమాలలు వేసి నివాళులర్పించి కుటుంబ సభ్యులను పరామర్శించారు.

ఘనంగా నేతాజీ జయంతి

విశాలాంధ్ర - చీరాల రూరల్ : నేతాజీ సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను చీరాలలో ఘనంగా నిర్వహించారు. ఎన్ ఆర్ అండ్ పీ ఎం హైస్కూల్ మైదానంలో ఆయన చిత్ర పటానికి పూలమాలలు వేసి ఘనంగా నివాళులు అర్పించారు. అనంతరం నీలకంఠపురంలోని వృద్ధాశ్రమంలోని వృద్ధులకు వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో అల్పాహారం, భోజనం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమంలో పోలుదాసు రామకృష్ణ, గురుప్రసాద్, మధుసూదన రావు, సురేష్, రమేష్, సుబ్బారావు, బదరీ నాథ్, రామారావు, దరియాసాహెబ్, నారాయణ మూర్తి, ప్రసాద్, కళ్యాణ్, తదితరులు పాల్గొన్నారు.

రక్తదాన హర్షణీయం

లోకేష్ జన్మదిన వేడుకల్లో 'ఉగ్ర'

విశాలాంధ్ర-కనిగిరి : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ 41వ జన్మదినం సందర్భంగా మంగళవారం టీడీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. మాజీ ఎమ్మెల్యే, కనిగిరి నియోజకవర్గ టిడిపి ఇన్చార్జ్ డాక్టర్ ముక్కు ఉగ్రనరసింహారెడ్డి ఆధ్వర్యంలో ఎన్టీఆర్ ట్రస్ట్ మరియు జననీ చారిటబుల్ ట్రస్ట్ సహకారంతో మెగా రక్తదాన శిబిరాన్ని నిర్వహించారు. రక్తదానం చేసిన ప్రతి ఒక్కరిని ఉగ్రనరసింహారెడ్డి అభినందించి ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో జారీచేసిన సర్టిఫికెట్లతో పాటు ప్రత్యేక బహుమతులను ఉగ్రనరసింహారెడ్డి అందచేశారు. అనంతరం టీడీపీ శ్రేణులతో కలిసి భారీ కేక్‌ను ఉగ్ర కట్ చేశారు. రక్తదానానికి పిలుపునిచ్చిన వెంటనే లోకేష్‌పై ఉన్న అభిమానంతో 191 మంది పార్టీ శ్రేణులు, యువత, అభిమానులు స్వచ్ఛందంగా తరలివచ్చి రక్తదానం చేయడం హర్షణీయం. ఈ రక్తదాన శిబిరంలో టీడీపీ నాయకులు షేక్ ఫిరోజ్, తమ్మినేని శ్రీనివాసరెడ్డి, గుడిపాటి ఖాదర్, తమ్మినేని వెంకటరెడ్డి, తమ్మినేని సురేంద్ర, అచల రవి, భాస్కర్‌రెడ్డి, కోట సురేష్ బాబు, మనోజ్ రెడ్డి,అరుణ, పార్వతి, వాజీద కరీమున్నీసా పాల్గొన్నారు.

గాదె ప్రత్యేక పూజలు

విశాలాంధ్ర - పిట్టలవానిపాలెం : అల్లూరు లక్ష్మీ నరసింహ స్వామి దేవాలయంలో మాజీ మంత్రి తనయుడు గాదె మధుసూదన్ రెడ్డి మంగళవారం పార్టీ నాయకులతో కలసి ప్రత్యేక పూజలు నిర్వహించారు. గాదె మధుసూదన్ రెడ్డి మాట్లాడుతూ పార్టీ ఎటువంటి బాధ్యతలు అప్పగించిన మన స్ఫూర్తిగా చేస్తానన్నారు. గోవతోటి విజయ్, మాజీ ఛైర్మన్ కుంచాల వీరరాఘవరెడ్డి, మాజీ సర్పంచ్ మెరుగు ధర్మారావు,మాజీ ఎంపిటిసి ఎలీషా, గిరిజారాణి, దేగల రవి రెడ్డి,మారుబోయిన శ్రీనివాస్ రెడ్డి,గాదె గోపిరెడ్డి,నంగు శ్రీనివాసరెడ్డి, అలవల అశోక్ రెడ్డి,గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

నేతాజీ జయంతి వేడుకలు

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : నేతాజీ సుభాష్ చంద్రబోస్ జన్మదిన సందర్భంగా పట్టణంలోని జనసేన పార్టీ కార్యాలయంలో నియోజకవర్గ సమన్వయకర్త నామన వెంకట శివనారాయణ పార్టీ నాయకులుతో కలసి నేతాజీ చిత్రపటానికి పూలమాలవేసి నివాళులర్పించారు. శివనారాయణ మట్లాడుతూ స్వతంత్ర భారతావనే లక్ష్యంగా పోరాడి,దేశం కోసం ప్రాణత్యాగం చేశారన్నారు. నేతాజీ సుభాష్ చంద్రబోస్ యువతలో స్ఫూర్తిని నింపి వారిని స్వతంత్ర పోరాటంలో భాగస్వాములను చేశారన్నారు. జిల్లా అధికార ప్రతినిధి ఇమ్మడిశెట్టి మురళీకృష్ణ, కర్లపాలెం మండల ప్రధాన కార్యదర్శి షేక్ సత్తార్, ఆరమళ్ళ సుజిత్, కాటూరి వెంకటరత్న కుమార్, ఊస శివరాం ప్రసాద్, కామిశెట్టి సాయిబాబు, నామన శ్యాం కుమార్ పాల్గొన్నారు.

ప్రకృతి సాగు వ్యవసాయం రైతులకు లాభదాయకం

విశాలాంధ్ర-తాళ్లూరు : ప్రకృతి రీత్యా సాగు చేసే వ్యవసాయం వల్ల రైతులకు లాభదాయకంగా ఉంటుందని మండల వ్యవసాయ అధికారి బి ప్రసాదరావు అన్నారు. క్షేత్ర పర్యటనలో భాగంగా మంగళవారం మండలంలోని తూర్పు గంగవరం గ్రామంలో గూడ శ్రీనివాస్‌రెడ్డి అనే రైతు ప్రకృతి సాగు విధానంతో తన 20 సెంట్లు పొలంలో 27 రకాల పంటల సాగు క్షేత్రాన్ని ఆయన పరిశీలించారు. ఈ కార్యక్రమంలో ప్రకృతి సాగు రైతు గూడా శ్రీనివాసరెడ్డి, ఐసిఆర్‌పిలు అనంతలక్ష్మి, ఉమాదేవి, రైతులు పాల్గొన్నారు.

ఘనంగా సుభాష్ చంద్రబోస్ జయంతి



విశాలాంధ్ర-మార్కాపురం టౌన్ : సుభాష్ చంద్రబోస్ జయంతి వేడుకలను స్థానిక జిల్లా పరిషత్ బాలుర ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయులు మునగాల చంద్రశేఖర్‌రెడ్డి ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ఆ పేరు వింటేనే రక్తం ఉప్పొంగి పోతుంది... మీరు నాకు రక్తాన్ని ఇవ్వండి... నేను మీకు స్వాతంత్ర్యం ఇస్తాను అని ఎలుగెత్తిన ధీరుడు... స్వేచ్ఛా స్వాతంత్ర్యాలు ఒకరు ఇచ్చేది కాదు మనకు మనమే సాధించుకోవాలి అని నినదించిన వీరుడు... రవి అస్తమించని బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన స్వతంత్ర సమర యోధుడు... తొలి ఇండియన్ ఆర్మీ తయారు చేసిన ఘనుడు... ఆజాద్ హింద్ ఫౌజ్ సృష్టికర్త... జయంతి మాత్రమే కలిగి వర్ధంతి లేని ఏకైన భారతీయుల హీరో తెల్ల దొరల కదంబ హస్తల నుండి భారత మాతకి విముక్తి కలిగించేందుకు తన ప్రాణాలను సైతం అడ్డు పెట్టి పోరాడిన నాయకుడు నేతాజీ సుభాష్ చంద్రబోస్ అని అన్నారు. అటువంటి త్యాగధనుల ఆశయాలను పుణికి పుచ్చుకుని రేపటి భవిష్యత్తు కోసం కష్టించి చదువుకోవాలని ఆయన విద్యార్థులను కోరారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జ్ ప్రధానోపాధ్యాయులు వెంకటేశ్వర్లు, శ్యామ్ సుభాకర్, కొండయ్య, సక్రునాయక్, కాళంరాజు, వేణుగోపాల్, వీరారెడ్డి, ప్రభాకర్‌రెడ్డి, భాస్కర్‌రెడ్డి, జె సునీత తదితర ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఘనంగా లోకేష్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-కురిచేడు : తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు తనయుడు జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ జన్మదిన వేడుకలను తెలుగుదేశం కురిచేడు మండల ప్రధాన కార్యదర్శి గంధం గురునాథం ఆధ్వర్యంలో మండల పార్టీ కార్యాలయం నందు మంగళవారం కేక్ కట్ చేసి నారా లోకేష్‌కు శుభాకాంక్షలు తెలియపరిచారు. వారు మాట్లాడుతూ సైకో పోవాలి సైకిలు రావాలి అని నినాదాలు చేసి స్వీట్లు పంచారు. ఈ కార్యక్రమంలో మొగల్ మస్తాన్‌వలి, గణపతి శేషయ్య, కాట్రాజ్ పెద్ద వెంగయ్య, షేక్ హుస్సేన్‌మియా, దాసరి రవి, మేరువ వెంకటేశ్వర్‌రెడ్డి, షేక్ సుభాని, కోటి లింగయ్య, పడమట నాయుడుపాలెం మాజీ సర్పంచి గద్దం బాలయ్య, షేక్ దాదాసాహెబ్, సీమల శ్రీనివాసరెడ్డి, కేసనపల్లి మోషే, కే చిన్న సామేలు, నబి, మస్తాన్ కొలిశెట్టి కాశీ విశ్వనాథరావు, పిల్లవలి, నవీన్ భాష, బోరిగొర్ల బిక్షాలు, కే దాస్, డ్రైవర్ బాబు మూలకాల సుబ్బారావు, దోరేపల్లి పాల్గొన్నారు.

పేదలకు వరం వైఎస్ఆర్ బీమా

విశాలాంధ్ర-పామూరు : పేద కుటుంబాలకు వైఎస్ఆర్ బీమా పథకం వరం లాంటిదని మండల వైసీపీ యువజన అధ్యక్షులు పట్టణ ఉపసర్పంచ్ యాదాల వెంకట సాయి కిరణ్ అన్నారు. మంగళవారం స్థానిక కరెంట్ ఆఫీస్ కాలనీనందు వేముల ఏడుకొండలు మృతి చెందారు. వైఎస్ఆర్ బీమా పథకం ద్వారా తక్షణ సహాయ నిమిత్తం 10 వేల రూపాయలను ఏడుకొండలు ధర్మపత్ని వేముల అనితకి యాదాల వెంకట సాయి కిరణ్ చేతుల మీదుగా అందించడం జరిగినది. ఈ కార్యక్రమంలో 16 వార్డు మెంబర్ షేక్ నాయబ్ రసూల్, వేముల రమణయ్య, సచివాలయ వెల్ఫేర్ అసిస్టెంట్ షేక్ షరీఫ్ పాల్గొన్నారు.

స్పందన అర్జీలు పరిష్కరించండి

విశాలాంధ్ర - చీరాల : 8 నెలల క్రితం ఇచ్చిన స్పందన అర్జీలు నేటికి పరిష్కారం కాలేదని అన్నం రాజు సుబ్బారావు అన్నారు. మంగళవారం స్పందన అర్జీల విషయమై ప్రకటన విడుదల చేశారు. ఈ ప్రకటనలో అన్నంరాజు సుబ్బారావు మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ప్రతి సోమవారం తరువాత విలేఖరుల సమావేశం ఏర్పాటు చేసి స్పందన అర్జీలు త్వరితగతిన పరిష్కరించాలని అంటున్నారు కానీ క్షేత్ర స్థాయిలో అర్జీలు పరిష్కారం కావట్లేదన్నారు. 8నెలలుగా అర్జీలు ఇస్తూనే ఉన్నాను కానీ పరిష్కారం చూపడంలో అధికారులు వైఫల్యం చెందుతున్నారన్నారు.

సేంద్రీయ ఎరువులతో తెగుళ్ల నివారణ

విశాలాంధ్ర-సీఎస్‌పురం : వ్యవసాయవిద్యను అభ్యసిస్తున్న విద్యార్థులు తయారు చేసిన సేంద్రీయ ఎరువులు రైతులకు ఉపయోగపడి తెగుళ్ల నివారణకు పనిచేస్తాయని కదిరిబాబురావు విద్యాసంస్థల సెక్రటరీ అండ్ కరస్పాండెంట్ కదిరి పార్థసారధి అన్నారు. మంగళవారం కదిరిబాబురావు వ్యవసాయ కళాశాలలో నాలుగవ సంవత్సరం చదువుతున్న విద్యార్థులు తయారు చేసిన ఎన్ రీచ్ వర్మికంపోస్ట్, వర్మీవాష్ ఎరువులను కదిరిపార్థసారథికి అందజేశారు. విద్యార్థులు వాన పాముల ద్వారా తయారు చేసిన వర్మీ వాష్, ఎన్ రీచ్ వర్మీ కంపోస్ట్ ఎరువుల గురించి రైతులకు అవగాహన కల్పించాలన్నారు.

పోలింగ్ కేంద్రాలలో మౌలిక సదుపాయాలు ఏర్పాటు చేయాలి

విశాలాంధ్ర-పర్చూరు: పోలింగ్ కేంద్రాలలో మౌలిక సదుపాయాలను ఏర్పాటు చేయాలని ఎన్నికల నియోజకవర్గ అధికారి వెంకటనారాయణ తెలిపారు. స్థానిక తహశీల్దార్ కార్యాలయంలో మంగళవారం రాజకీయ పార్టీల నాయకులతో సమావేశం నిర్వహించారు. ఈఆర్ఓ మాట్లాడుతూ నియోజక వర్గంలో 295 పోలింగ్ కేంద్రాలు ఉన్నాయని, వాటిని సందర్శించి సదుపాయాల లోపాలను గుర్తించి ఈనెల 31 లోపు పూర్తిస్థాయి సౌకర్యాలు కల్పించాలని తెలిపారు. ఈనెల 5వ తేది తర్వాత 6,7,8 ఫారమ్‌ల ద్వారా 1,079 దరఖాస్తులు అందాయని, వాటిని విచారించి అర్హులకు ఓటు హక్కును కల్పించి జాబితాలో చేర్చు తామని తెలిపారు. ఓటరు జాబితాను పార్టీల నాయకులకు అందిం చారు. సమావేశంలో రాజకీయ పార్టీల నాయకులు ఉన్నారు.

సాగుభూమి పట్టాలు పంపిణీ చేసిన 'ఆమంచి'

విశాలాంధ్ర-పర్చూరు: రైతులకు సాగుభూమి పట్టాలు పంపిణీ చేసిన వైసీపీ ఇన్‌ఛార్జి ఆమంచి కృష్ణమోహన్. మండలంలోని పోతుకట్లలో మంగళవారం కౌలుదారుల సహకార సంఘం ఆధ్వర్యంలో ఉన్న 35.82 ఎకరాలను 1926లో 85 మంది సన్న, చిన్నకారు రైతులకు డీకే పట్టాలు అందించారు. ఆమంచి మాట్లాడుతూ రైతులకు పూర్తి హక్కులు కల్పిస్తూ ప్రభుత్వం పట్టాలను అందించా మని, వారికి పూర్తిగా పథకాలు అమలు అవుతాయని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దార్ సంధ్యశ్రీ, ఆర్ఐ బత్తుల ప్రేమ్‌కుమార్, సర్పంచ్ దాసి ఆనందరావు, ఎంపిటీసీ కిషోర్‌రెడ్డి, నాయకులు బలరామ్, రాఘవయ్య, జంగా అనిల్, సురేష్ ఉన్నారు.

పోరాట యోధుడు నేతాజీ

విశాలాంధ్ర - చీరాల : స్వాతంత్ర్య భారతావనే లక్ష్యంగా పోరాడి, దేశం కోసం నేతాజీ ప్రాణత్యాగం చేశారని నేతాజీ సేవా సమితి ప్రతినిధులు అన్నారు.నేతాజీ సుభాష్ చంద్రబోస్ 127వ జయంతి సందర్భంగా పేరాల చిన్నరథం కూడలిలోని నేతాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. పలువురు వక్తలు మాట్లాడుతూ నేతాజీ యువతలో స్ఫూర్తిని నింపి స్వతంత్ర పోరాటంలో భాగస్వాములను చేశారన్నారు. ఈకార్యక్రమంలో నేతాజీ సమితి అధ్యక్ష కార్యదర్శులు చుండూరి కృష్ణమూర్తి, పవని భాను చంద్రమూర్తి, ప్రతినిధులు అంబటి పుష్పరాజు, మణి బాబు, నరేష్, దివేన్,అన్నంరాజు సుబ్బారావు, సంకా చంద్రమౌళి, ప్రసాద రావు తదితరులు పాల్గొన్నారు.

ఎన్నికలు నిర్వహించడానికి అధికారులు సంసిద్ధం కావాలి

కలెక్టర్ పి.రంజిత్ బాషా

విశాలాంధ్ర - బాపట్ల : ఓటర్లను ప్రలోభ పెట్టే పరిస్థితులకు భిన్నంగా రానున్న సాధారణ ఎన్నికలు నిర్వహించ డానికి అధికారులు సంసిద్ధం కావాలని జిల్లా కలెక్టర్ పి.రంజిత్ బాషా చెప్పారు. ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, ఎన్నికలకు సంబంధించిన నోడల్ అధికారులతో మంగళవారం స్థానిక కలెక్టరేట్‌లోని ఆయన చాంబర్లో సమావేశం నిర్వహించారు. రానున్న ఎన్నికలు ఆరోగ్యకరమైన వాతావరణంలో జరిగేలా అధికారులు ప్రణాళికలు రూపొందించుకోవాలని కలెక్టర్ అన్నారు.ప్రతి ఓటరు స్వేచ్ఛగా తమ ఓటు హక్కు వినియోగించుకునే అవకాశం కల్పించడమే లక్ష్యం అన్నారు. ఎన్నికల నిర్బంధ నిర్వహణ వ్యవస్థ ఎలక్షన్ సీజర్ మేనేజ్‌మెంట్ సిస్టమ్‌పై నోడల్ అధికారులు అవగాహన పొందాలన్నారు. అలాంటి కార్య కలాపాలను ముందస్తుగా గుర్తించి నిరోధించే ప్రక్రియలో భాగంగా నిఘా పెంచా లన్నారు. ఎన్నికల షెడ్యూల్ విడుదల గాకముందే ఇలాంటివి జరిగే అవకాశం ఉందన్నారు. చెక్ పోస్ట్‌లపై ప్రత్యేక దృష్టి సారించాలని, ఫ్లయింగ్ స్క్వాడ్ అప్రమత్తం కావా లన్నారు. ఈ సమావేశంలో జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్, ఏఎస్పీ పి.మహేష్, జిల్లా రెవెన్యూ అధికారి పి.వెంకటరమణ,ఈఆర్ఓలు, ఎన్నికల నోడల్ అధికారులు తదితరులు పాల్గొన్నారు.

కార్డెన్ అండ్ సెర్చ్‌లో 350 లీటర్ల బెల్లం ఊట ధ్వంసం

విశాలాంధ్ర - రేపల్లె : నాటు సారాయి తయారు చేసిన, అక్రమంగా రవాణా చేసిన, నిల్వవుంచిన, విక్రయించిన చట్ట పరమైన కఠిన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ వకుల్ జిందాల్ హెచ్చరించారు.జిల్లాలోని నిజాంపట్నం మండలం అడవులదీవి పోలీస్ స్టేషన్ పరిధిలోని దిండి పంచాయితీ అధవల గ్రామంలో నాటుసారా స్థావరాలను లక్ష్యంగా చేసుకొని కార్డెన్ అండ్ సర్చ్ నిర్వహించినట్లు చెప్పారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో నాటు సారాయి తయారుచేసిన ప్రదేశాలతో పాటుగా అనుమానిత ప్రాంతాలను లక్ష్యంగా చేసుకొని కార్డెన్ అండ్ సర్చ్ నిర్వహించినట్లు తెలిపారు.అధవల గ్రామ శివారులోని మడ అడవులలో నాటు సారాయి తయారు చేస్తున్న లైవ్ భట్టీలను గుర్తించి ధ్వంసం చేసినట్లు చెప్పారు.నాటుసారా తయారీకి పులియబెట్టి ప్లాస్టిక్ డ్రమ్ములలో నిలువవుంచిన సుమారు 350 లీటర్ల బెల్లపు ఊటను అధికారులు ధ్వంసం చేశారని చెప్పారు.నాటుసారా తయారీకి పాల్పడే వారిపై పిడి చట్టం ప్రయోగించడానికి కూడా వెనుకాడబోమని హెచ్చరించారు.చట్ట వ్యతిరేక కార్యక్రమాలకు సంబంధించిన సమాచారం తెలిసిన యెడల ప్రజలు వెంటనే పోలీస్ స్టేషన్ ఎస్. హెచ్. ఓకి,డయల్ 100,112 నెంబర్లకు, ఎస్పీ బాపట్ల హెల్ప్‌లైన్ నెంబర్ 8333813228కు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు.సమాచారం అందించిన వారి వివరాలు గోప్యంగా ఉంచుతామని తెలిపారు. కార్యక్రమంలో రేపల్లె డి.ఎస్.పి టి.మురళి కృష్ణ, టౌన్ ఇన్స్పెక్టర్ ఎం.నజీర్ బేగ్,అడవులదీవి ఎసై ఎస్.వెంకట రవి, నిజాంపట్నం ఎసై రమేష్, చెరుకుపల్లి ఎసై వై.సురేష్, నగరం ఎసై డి.రామకృష్ణ, సెబ్ అధికారులు, రేపల్లె సబ్ డివిజన్ పరిధిలోని పోలీస్ సిబ్బంది మొత్తం 62 మంది పోలీస్ అధికారులు సిబ్బంది పాల్గొన్నారు.

సాధికార యాత్ర విజయవంతం - ప్రజలకు ధన్యవాదాలు

- కరణం వెంకటేష్

విశాలాంధ్ర - చీరాల : సామాజిక సాధికార బస్సు యాత్రను విజయవంతం చేసిన చీరాల నియోజకవర్గ ప్రజలకు,వైఎస్సార్ సీపీ నాయకులకు, కార్యకర్తలకు,కరణం అభిమానులకు ముఖ్యంగా కార్యక్రమం మొదటి నుండి చివరి వరకు వ్యయ ప్రయాసల కోర్చి పనిచేసిన పాత్రికేయ మిత్రులకు, సోషల్ మీడియా మిత్రులకు పేరు పేరున ధన్యవాదాలని కరణం వెంకటేష్ ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం నియోజకవర్గ ప్రజలకు వైస్సార్సీపీ నాయకులకు సామాజిక సాధికార బస్సు యాత్రను జయప్రదం చేసినందుకు ప్రకటన ద్వారా ధన్యవాదాలు తెలిపారు. నా మీద నమ్మకంతో పిలవగానే ప్రజలంతా వచ్చారని తనపై నియోజకవర్గ ప్రజలు,ఉంచిన ప్రేమ ఆదరణ, అభిమానాలు వెలకట్టలేనివన్నారు.

ఘనంగా నారా లోకేష్ పుట్టినరోజు వేడుకలు

విశాలాంధ్ర - వేమూరు : నిద్రలో ఉన్న యువతను మేల్కొల్పిన నేత నారా లోకేష్ అని మాజీ మంత్రి, తెలుగుదేశం పార్టీ పోలిట్ బ్యూరో సభ్యులు నక్కా ఆనందబాబు అన్నారు. మంగళవారం టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి లోకేష్ జన్మదిన వేడుకలను నియోజకవర్గ కేంద్రమైన వేమూరులోని టిడిపి కార్యాలయ ప్రాంగణంలో ఘనంగా నిర్వహించారు.జిల్లా టిడిపి అధికార ప్రతినిధి జొన్నలగడ్డ విజయబాబు అధ్యక్షతన జరిగిన కార్యక్రమంలో ఆనంద్ బాబు లోకేష్ బర్త్ డే కేకును కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆనంద్ బాబు మాట్లాడుతూ టీడీపీకి రానున్న రోజుల్లో లోకేష్ సారథిగా ముందు నిలబడతారన్నారు.ఆయన రాజకీయాల్లోకి వచ్చిన తర్వాత వైసీపీ నేతలు అనేక రకాలుగా ఇ బ్బందులకు గురిచేశారని అయినప్పటికీ వాటిని లెక్కచేయకుండా నిరుత్సాహపడకుండా తాత నందమూరి తారక రామారావు ఆశయాలకు అనుగుణంగా అడుగులు వేస్తున్న తన తండ్రి చంద్రబాబు నాయుడు ఆలోచనకు అనుగుణంగా ప్రజల ముందుకు వచ్చారన్నారు.సుమారు 3000 కిలోమీటర్లకు పైగా పాదయాత్ర చేసి ప్రజలకు చేరువ అవటంతో పాటు అన్ని వర్గాల వారి సమస్యలను మనసులో నిక్షిప్తం చేసుకున్నారన్నారు.అంతేకాకుండా ఆయా సమస్యల పరిష్కారానికి హామీ ఇవ్వడం కూడా జరిగిందన్నారు. పాదయాత్ర ద్వారా టీడీపీకి మరో 40 సంవత్సరాలకు తిరుగు లేని నాయకత్వాన్ని లోకేష్ అందించబోతున్నారని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రజల క్షేమం కోసం రాష్ట్ర అభివృద్ధి కోసం జనసేన అధినేత పవన్ కళ్యాణ్ టీడీపీతో కలిసి అడుగులు వేస్తున్నారని ఇందుకు టిడిపి శ్రేణులు జనసేన శ్రేణులతో చేయి కలిపి ముందుకు నడవాలన్నారు. కార్యక్రమంలో పార్టీ నాయకులు మన్నవ సుబ్బారావు, డాక్టర్ పృథ్వీలత, డాక్టర్ కనగాల మధుసూదన ప్రసాద్,తూనుగుంట్ల సాయిబాబు,దొప్పలపూడి సుధాకర్ బెల్లంకొండ వెంకటేశ్వరరావు, శరత్ చంద్ర, రాఘవరావు, కృష్ణ భగవాన్, గంటా స్వాతి తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్ర ప్రజలను చైతన్యం చేసిన లోకేష్

విశాలాంధ్ర - రేపల్లె : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ జన్మదిన వేడుకలు పట్టణంలోని టీడీపీ కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు. టీడీపీతోనే రాష్ట్ర భవిష్యత్ అని,లోకేష్ నాయకత్వం వర్ధిల్లాలంటూ నినాదాలు చేశారు. అనంతరం కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ మేరకు టీడీపీ నాయకులు మాట్లాడుతూ లోకేష్ యువగళం పాదయాత్రతో వైసీపీ ప్రభుత్వానికి ముచ్చెమటలు పట్టాయన్నారు. కార్యక్రమంలో టీడీపీ నాయకులు అనగాని శివ ప్రసాద్, పంతాని మురళీ, సుబ్రహ్మణ్యం, ఏడుకొండలు, కొలసాని రాము, రవి, జీవి నాగేశ్వరరావు పాల్గొన్నారు.

మొక్కుబడిగా మండల సమావేశం

విశాలాంధ్ర - బల్లికురవ : మండల ప్రజా సమస్యలను చర్చించి పరిష్కరించేందుకు వేదికైనా మండల సర్వసభ్య సమావేశానికి పలువురు సర్పంచులు ఎంపిటీసీలు అధికారులు డుమ్మా కొట్టడంతో మొక్కుబడిగా మండల సమావేశం నిర్వహించారు.మంగళవారం స్థానిక ఎంపీడీవో కార్యాలయంలో ఎంపిపి బడుగు శ్రీ లక్ష్మి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం నిర్వహించారు. ఉదయం 11 గంటలకు సమావేశం నిర్వహించాల్సి ఉండగా 12 గంటలకు మొదలై గంటన్నరలోని సమావేశం ముగిసిందంటే ప్రజా సమస్యలపై ఏ పాటి చర్చ జరిగిందో ఇట్లే అర్థమవుతుంది. సమావేశానికి హాజరైన అధికారులు వారు ముందుగా తయారు చేసుకున్న స్క్రిప్ట్ చదివి వినిపించగా మరికొందరు అధికారులు సమావేశానికి రాలేదు. మూడు నెలలకు ఒకసారి జరిగే మండల సమావేశంలో గ్రామాలలో సమస్యలు తిష్ట వేసినప్పటికీ సమస్యలు పరిష్కరించ మని అధికారులను అడిగే నాయకుడే లేకపోవడం కొసమెరుపు.ప్రోటోకాల్ ప్రకారం జరిగే మండల సమావేశానికి కొందరు షాడో సర్పంచ్లు రాగా మరికొందరు నాయకులు దర్జాగా వచ్చి కూర్చున్నారు. మండల సమావేశం సమోసా తిన్నామా టీ తాగి వెళ్ళామా అన్న చందంగా జరిగింది. ఈ సమావేశంలో మండల ప్రత్యేక అధికారి బాలసుబ్రమణ్యం, ఎంపీడీవో బ్రహ్మయ్య,తాసిల్దార్ రవిబాబు, వైస్ ఎంపీపీ ఇప్పల వెంకట సుబ్బారెడ్డి, జడ్పిటిసి చెంతల అంజలి,మండల కో ఆప్షన్ సభ్యులు షేక్ శ్రీనువల్లి పాల్గొన్నారు.

పేదల భూముల కోసం బావిరెడ్డి పోరాటం అజరామరం

విశాలాంధ్ర - కొల్లూరు : రైతులు, రైతు కూలీల సంక్షేమం కోసం చల్లపల్లి జమిందారుకు వ్యతిరేఖంగా బావిరెడ్డి చేసిన పోరాటాలు అజరామరంగా నిలిచిపోతాయి. జమిందారి అకృత్యాలకు వ్యతిరేఖంగా ఇళ్లు, వాకిలి, భార్యా, బిడ్డలను వదిలి అనునిత్యం జమిందారి కబంధ హస్తాల్లో ఉన్న లంక భూముల కోసం అలుపెరగని పోరాటం చేశారు. జమిందారి కుతంత్రాలకు ఎదురొడ్డి నిలిచి నిరంతరం ఆనాడు తన సహచర పాతతరం కమ్యూనిస్టు నాయకులతో కలసి బావిరెడ్డి వెంకటేశ్వరరావు సాగించిన పోరాట ఫలంతోనే జమిందారి చెర నుంచి పంట భూములు రైతుల చేతికి దక్కడానికి మూల కారణం. చల్లపల్లి జమిందారుకు వ్యతిరేకంగా గాజుల్లంక రైతులు జరిపిన విప్లవాత్మక పోరాటం రాష్ట్రంలోనే సంచలనం సృష్టించింది. భూమికోసం, భుక్తికోసం, పేద ప్రజల అభ్యున్నతికోసం ఎన్ని ఒడిదుడుకులు వచ్చినా, ఇబ్బందులు ఎదురైనా, నమ్మిన సిద్ధాంతం కోసం తుదిశ్వాస వరకు కమ్యూనిస్టుగానే జీవించిన ఆదర్శ కమ్యూనిస్టు, జమిందారీ వ్యతిరేక రైతాంగ పోరాట యోధుడు బావిరెడ్డి వెంకటేశ్వరరావు నాటి తెనాలి తాలూకా, కొల్లూరు మండలంలోని ఆవులవారిపాలెంలో 1920లో జన్మించారు. కొల్లూరులో ప్రాథమిక విద్యనభ్యసించిన ఆయన ఎస్ఎస్ఎల్సీ చదువుతున్న రోజుల్లోనే జాతీయ భావావేశం అబ్బింది. స్వతంత్ర పోరాట గాధలతో ప్రభావితులయ్యారు. 1936-38 సంవత్సరంలో గుంటూరు ఏసీ కళాశాలలో చదువుతున్న రోజుల్లో ఆనాటి కాంగ్రెస్ సోషలిస్టు భావాలుగల పులుపుల శివయ్య, మానికేని బసవపున్నయ్య, ప్రతాప రామసుబ్బయ్య, తుమ్మల వెంకట్రామయ్యలతో పరిచయమైంది. స్వాతంత్రోద్యమంలో ఆనాటి గ్రామ పెత్తందార్ల ఆగ్రహానికి గురయ్యారు. గుంటూరులో జరిగిన కమ్యూనిస్టు పార్టీ మహాసభలో పాల్గొని ఆపార్టీలో చేరారు. నాటి నుంచి పల్లెల్లో నిరంతరం తిరుగుతూ, పేద ప్రజల అభ్యున్నతి కోసం పనిచేయడం ప్రారంభించారు. బ్రిటీష్ ప్రభుత్వ అనుచరుడైన చల్లపల్లి రాజాతో పోరాటానికి సిద్ధపడ్డారు. భావిరెడ్డి జమిందారు తనవికాని లంక భూములను అమ్మి సొమ్ము చేసుకునేందుకు ప్రయత్నించగా, కమ్యూనిస్టు పార్టీ నాయకులు చల్లపల్లి నారాయణరావుతో కలసి లంక గ్రామాలలో పోరాటం సాగించారు. భావిరెడ్డి ఎంతో నేర్పుతో, ఓర్పుతో వివిధ రాజకీయ దృక్పదం గల వారందరినీ ఏకం చేసి, రైతాంగాన్ని కూడగట్టి పేదల భూముల కోసం రాజాతో చారిత్రాత్మక పోరాటం నిర్వహించారు. ఆఉద్యమంలో ఎన్నో కేసుల్లో నిందితుడయ్యారు. ప్రభుత్వ సహాయంతో జమిందారు, రహస్య జీవితం గడుపుతున్న బావిరెడ్డి అజ్ఞాతంగానే నాయకత్వం వహిస్తూ జమిందారును ఎదుర్కొన్నారు. జమిందారుకు అండగా ఉన్న పోలీసు యంత్రాంగం రంగంలోకి దిగి అమాయకులైఉన రైతు కూలీలపై దౌర్జన్యం చేశారు. రైతు కూలీలు ప్రతిఘటించడంతో పోలీసులు కాల్పులు నిర్వహించారు. 1947 ఏప్రియల్ 10న గాజుల్లంకలో ఉద్యమించిన రైతు కూలీల రక్తం కృష్ణనీటిలో కలసి ప్రవహించింది. పోలీసుల కాల్పుల్లో వీరనారి బావిరెడ్డి వియమ్మ (45), సనక సుబ్బారావు (25), మత్తి సుబ్బారావు (18), తాడిశెట్టి వెంకటేశ్వరరావు (12), అమరులయ్యారు. కృష్ణానదీ తీరంలోని గాజుల్లంకలో చల్లపల్లి జమిందారుకు వ్యతిరేకంగా జరిగిన పోరాటం రాష్ట్రంలోనే సంచలనం కలిగించింది. పట్టువిడవని విక్రమార్కునిలాగా భావిరెడ్డి వెంకటేశ్వరరావు, కామ్రేడ్ నిమ్మగడ్డ బాలభాస్కరరావు, సనక పోతయ్య, చందన వెంకటేశ్వరరావు, కమ్మెల కనకదుర్గయ్యలతో ఉద్యమాన్ని ఉదృతంచేశారు. ప్రభుత్వం శాంతి భద్రతల పేరుతో సాయుధ పోలీసు దళాలను లంకలపైకి పంపింది. భావిరెడ్డి ఇల్లును చుట్టుముట్టారు. అరెస్టు చేసి తెనాలి, రేపల్లె, విశాఖ, బళ్లారి, జైళ్లకు పంపారు. అస్వస్థతకు గురికావడంతో వైద్య కోసం విడుదల చేశారు. జమిందారు కక్షకట్టి హత్యకేసులో నిందితుని చేశారు. మరల రహస్య జీవితంలో లంక భూములు, బంజరు భూముల పోరాట ఉద్యమాలను భావిరెడ్డి కొనసాగించారు. జమిందారు ముఠాలను ఎదుర్కొంటూ, పేద ప్రజల పక్షాన ఉండి లంక గ్రామాల్లో తాలుకాలో కమ్యూనిస్టు పార్టీ అభ్యున్నతికి కృషి చేసిన ఆదర్శ కమ్యూనిస్టు బావిరెడ్డి వెంకటేశ్వరరావు. బావిరెడ్డి తుది శ్వాస వరకు కమ్యూనిస్టు సిద్ధాంతాల కోసమే కృషి చేశారు. అన్ని పార్టీల అభిమానం పొందిన ఆయన జనవరి 24న మృతి చెందారు. నేటితరం కమ్యూనిస్టులు వారిని స్ఫూర్తిగా తీసుకొని సమసమాజ నిర్మాణం కోసం కృషి చేయడానికి మార్గదర్శకంగా నిలిచారు.

నేడు 44వ వర్ధంతి

చల్లపల్లి జమిందారీ వ్యతిరేఖ పోరాట యోధుడు, కమ్యూనిస్టు పార్టీ నాయకులు బావిరెడ్డి వెంకటేశ్వరరావు వర్ధంతి బుధవారం సాయంత్రం కొల్లూరు మండలం ఆవులవారిపాలెంలో జరుగు తుందని సీపీఐ బాపట్ల జిల్లా సమితి సభ్యులు ఘంట రాంబాబు, భావిరెడ్డి ప్రభాకరరావులు తెలియజేశారు. ఆవులవారి పాలెం-పెసర్లంక మూడు రోడ్ల కూడలి వద్దనున్న బావిరెడ్డి స్మారక స్థూపం వద్ద నిర్వహించనున్న వర్ధంతి కార్యక్రమంలో సీపీఐ, ఎస్టీయూ నాయకులతోపాటు రాజకీయాలకు అతీతంగా పలువురు ప్రముఖులు పాల్గొననున్నట్లు తెలిపారు.

పోరాటంలో అంగన్‌వాడీల విజయం

విశాలాంధ్ర-వెలిగండ్ల : ప్రపంచంలో ఎక్కడైనా సరే పోరాటం మాత్రమే విజయం సాధించగలదని పోరాడితే పోయేదేమీ లేదు బానిస సంకెళ్లు తప్ప అన్న మహనీయుల సూక్తిని అంగన్‌వాడి పోరాటం నిరూపించిందని ఆంధ్రప్రదేశ్ జనవిజ్ఞాన వేదిక నాయకులు ఒంటి పెంట మాలకొండారెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని వెలిగండ్ల కేంద్రంలో ఐసిడిఎస్ ప్రాజెక్టు ఎదుట అంగనవాడి పోరాటాల సాధన సభ వై.రాధమ్మ, ముక్కు మహాలక్ష్మి అధ్యక్షతన నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా ఉపాధ్యక్షులు బడుగు వెంకటేశ్వర్లు మాట్లాడుతూ నిర్బంధాలను అతిక్రమించి హక్కులు సాధించుకొనుటకు అంగన్వాడి వర్కర్స్ అండ్ హెల్పర్స్‌కు ఉద్యమ అభినందనలు తెలిపారు. ప్రభుత్వం ఎస్మా లాంటి చట్టాలను ప్రయోగించిన ఉద్యోగాలను తొలగిస్తామని బెదిరించిన ఎలాంటి బెదిరింపులకు లొంగకుండా విజయం సాధించారని అన్నారు. సెక్టార్ లీడర్లు సోమ వెంకటలక్ష్మి, రెడ్డెం తిరుపతమ్మ, ఎం పార్వతి, సుధారాణి, దమ్ము పద్మావతి, సిహెచ్ రఫియా, పెద్దక్క శారద, విజయలక్ష్మి, సరస్వతి, ఆదిలక్ష్మి, పాల్గొన్నారు.

సంఘటితంగా పోరాడితేనే విజయం

విశాలాంధ్ర-దర్శి : దరిశి అంగన్ వాడీల సమ్మె సంఘటితంగా పోరాడితేనే విజయాలు వస్తాయని ఈ 42 రోజుల సమ్మె నిరూపణ చేసిందని సిఐటియు దరిశి నియోజక వర్గ కార్యదర్శి తాండవ రంగారావు అన్నారు. దరిశి ఐసిడిఎస్ కార్యాలయం వద్ద యూనియన్ అధ్యక్షరాలు ఎ.తిరపతమ్మ అధ్యక్షతన దరిశి గడియారం స్థంభం వద్ద టపాసులు పేల్చీ, మిఠాయిలు పంచుకుని విజయోత్సవ ప్రదర్శన జరిపుకున్నారు. ఆయన మాట్లాడుతూ 42 రోజులపాటు సమ్మెని కొనసాగించడానికి కృషి చేసిన ప్రజా సంఘాలకు, ప్రతి ఒక్కరికి ధన్యవాదములు తెలిపారు. హక్కుల కోసం కార్మికులు, ఉద్యోగులు పోరాటాలు చేస్తేనే హక్కులు వస్తాయన్నారు. ఈ సభలో ప్రజా సంఘాల నాయకులు కె.హనుమంతరావు, బోడపాటి హనుమంతరావు, వి.ఆంజ నేయులు , డి వై ఎఫ్ ఐ జిల్లా కార్యదర్శి కె.ఎఫ్ బాబు, దళిత, బిసి సంఘాల నాయకులు గర్నిపూడి ప్రేమ్ కుమార్, నాగమణి, అన్నవరపు వెంకటేశ్వ రరావు, బాలమ్మ, ఫాతిమా, ప్రశాంతి పాల్గొన్నారు.

వృద్ధులకు అన్నదానం

విశాలాంధ్ర-దర్శి : తెలుగు దేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ జన్మదిన వేడుకలు దర్శి నియోజకవర్గ తెలుగు యువత అధ్యక్షులు పుల్లలచెరువు చిన్నా,ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. స్థానిక గడియారం స్థంభం సెంటర్‌లో ఎన్‌టిఆర్, శ్రీరాములు విగ్రహాలకు పూలా మాల వేసి ఘనంగా నివాళులర్పించారు. ముఖ్య అతిధిగా హాజరైన మాజీశాసన సభ్యులు నారపుశెట్టి పాపారావు మాట్లాడుతూ యువనేత ఆయురారోగ్యాలతో మరెన్నో జన్మదినలు జరుపుకోవాలని ఉన్నత పదవులను చేపట్టాలని అన్నారు. అనంతరం కేక్ కట్ చేసి పంచిపెట్టారు. పులిహోరా పంపిణీ చేశారు. సాయి వృద్ధ ఆశ్రమంలో అన్నదానం అన్నదానం చేశారు. ఈ కార్యక్రమంలో ఉపాధ్యక్షులు కల్లూరి సుబ్బు, వీరనాగిరెడ్డి, అధికార ప్రతిది గుర్రం బాలకృష్ణ నగర పంచాయతీ చైర్మన్ నారపుశెట్టి పిచ్చయ్య, మండల పార్టీ అధ్యక్షులు చిట్టె వెంకటేశ్వర్లు, పట్టణ పార్టీ అధ్యక్షులు యాదగిరి వాసు, పార్లమెంట్ ఉపాధ్య క్షులు మారెళ్ల వెంకటేశ్వర్లు, తెలుగు మహిళా అధికార ప్రతినిధి శోభారాణి, కార్యదర్శి సంగా తిరుపతి రావు, బీసీ కార్యనిర్వాహక కార్యదర్శి బెల్ల శ్రీను, క్లస్టర్ నారపుశెట్టి మధు, ఐటిడిపి ఛాంపియన్ సందు రామయ్య, కౌన్సిలర్లు దారం సుబ్బారావు, దత్తు, రంగా, దినకర్, రామగిరి, పార్టీ నాయకులు శేఖర్ పంతులు, గాలెయ్య, జనసేన పట్టణ పార్టీ అధ్యక్షులు చాతరాసి కొండయ్య, ప్రోగ్రామ్ కమిటీ సభ్యులు పసుపులేటి చిరంజీవి, నాయకులు పుప్పాల పాపారావు పాల్గొన్నారు.

ఘనంగా లోకేష్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-తాళ్లూరు : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ మంత్రి తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బాబు 41వ జన్మదిన వేడుకలు మండల కేంద్రమైన తాళ్లూరులో రాష్ట్ర తెలుగు యువత ప్రధాన కార్యదర్శి గొల్లపూడి వేణుబాబు ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు బొమ్మిరెడ్డి ఓబులరెడ్డి, తెలుగుదేశం పార్టీ ఒంగోలు పార్లమెంటరీ కార్యవర్గ సభ్యులు మానం రమేష్ బాబు, ఎస్ కొండారెడ్డి, వల్లభనేని సుబ్బయ్య, రాష్ట్ర మైనార్టీ సెల్ ప్రధాన కార్యదర్శి ఎస్కే పెద కాలేశావలి(బడే), దర్శి నియోజకవర్గ మైనార్టీ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు ఎస్ కే మీరా మొహిద్దిన్, మండల బీసీ సెల్ అధ్యక్షులు పిన్నిక రమేష్, తదితరులు ముందుగా ఎన్టీఆర్ విగ్రహానికి పూలమాలు వేసి నివాళు లర్పించారు. తదనంతరం పులిహోర అన్నదాన కార్యక్రమం చేపట్టారు. తదుపరి ప్రభుత్వ ప్రాథమిక వైద్యశాల నందు రోగులకు పండ్లు, బ్రెడ్లు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ సీనియర్ నాయకులు మేడగం వెంకటేశ్వర రెడ్డి క్రైపు రామకోటిరెడ్డి, ఐ శ్రీనివాస్‌రెడ్డి, యువ నాయకులు సానె సురేష్, జాస్తి గిరిబాబు, మండల తెలుగుదేశం పార్టీ మైనార్టీ సెల్ నాయకులు ఎస్.కె కాసిం సైదా, టిడిపి నాయకులు యాతం శ్రీనివాస్ రెడ్డి క్రైపు నాగార్జునరెడ్డి, ఆదినారాయణ రెడ్డి ,నాగేశ్వరరావు, ఎఫ్రా న్, తిరుపతి స్వామి, మండల జనసేన పార్టీ అధ్యక్షులు కూటాల ప్రసాద్, తెలుగుదేశం పార్టీ నాయకులు, లోకేష్ బాబు అభిమానులు పాల్గొన్నారు.

25నుంచి శివన్న ఎన్నికల ప్రచారం

విశాలాంధ్ర-దర్శి : దర్శి నియోజకవర్గ వైసీపీ ఇంచార్జి డాక్టర్ బూచేపల్లి శివప్రసాదరెడ్డి ఈ నెల 25తేదీ నుండి మన ఊరికి మన శివన్న కార్యక్రమంలో భాగంగా ఎన్నికల ప్రచారాన్ని ప్రారంభిస్తున్నట్లు తెలిపారు. ఉదయం 10గంటలకు దర్శి మండలం రాజంపల్లి ప్రసన్నంజనేయ స్వామి దేవస్థానంలో ప్రత్యేక పూల నిర్వహిస్తారు. రాజంపల్లి, కొత్తరెడ్డి పాలెం, దర్శిలో వైఎస్సార్ విగ్రహాలకు పూలమాల వేసి నివాలర్పిస్తారు తెలిపారు. రాజంపల్లి వద్ద నుండి బైక్ ర్యాలీ పులిపాడు వరకు ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని అయన వ్యక్తి గత కార్యదర్శి సందిరెడ్డి నరేంద్ర రెడ్డి తెలిపారు. ముండ్లమూరు మండలం బృందావనం, పులిపాడులో ఎన్నికల ప్రచారంలో భాగంగా ప్రచారం నిర్వహించడం జరుగుతుందని చెప్పారు. వైఎస్సార్ పార్టీ నాయకులు కార్యకర్తలు సర్పంచులు, ఎంపిటిసిలు అన్నారు.

పేషెంట్లకు ఫ్రూట్స్ పంపిణీ

విశాలాంధ్ర-ఒంగోలు టౌన్ : నారా వారి వంశధారకుడు నందమూరి అల్లుడు టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి ఇప్పగలం నవ శకం అధినేత నారా లోకేష్ 41వ జన్మదిన వేడుకలను టిఎన్ఎస్ వి మాజీ జిల్లా కార్యదర్శి పోకనాయుడు బాబు ఆధ్వర్యంలో ఘనంగా మంగళవారం జన్మదిన వేడుకలు నిర్వహించారు. స్థానిక అశ్విని హాస్పిటల్‌లో పలువురు పేషెంట్లకు డాక్టర్ గద్దె ఏడుకొండలతో కలిసి ఫ్రూట్స్, బ్రెడ్లు, స్వీట్స్ లోకేష్ జన్మదిన వేడుకల సందర్భంగా ప్రతి సంవత్సరం ఆయన పేరుపై పలు సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నానని తెలిపారు.

భారత రాజ్యాంగ లక్ష్యాల పరిరక్షణ నేటి కర్తవ్యం

విశాలాంధ్ర - చీరాల : భారత రాజ్యాంగ లక్ష్యాలు, స్వాతంత్రోద్యమ ఆశయాలు నానాటికి దిగజారిపోతున్నాయని ఊరూరా జన విజ్ఞానం రాష్ట్ర నాయకులు కోటా వెంకటేశ్వరరెడ్డి ఆందోళన వ్యక్తం చేశారు.మంగళవారం ఆల్ ఇండియా ఘంటసాల చైతన్య వేదిక,ఊరూరా జనవిజ్ఞానం అభ్యుదయ భావాల వేదిక,చీరాల సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్, ప్రజానాట్యమండలి సంయుక్త ఆధ్వర్యంలో చీరాల ఎన్జీఓ హోమ్‌లో 75 ఏళ్ల భారత్ రిపబ్లిక్ దినోత్సవాలను పురస్కరించుకొని భారత రాజ్యాంగ పీఠిక ప్రజలందరూ చర్చించాలని అనే అంశంపై రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహించారు.ఈ కార్యక్రమంలో కోట వెంకటేస్వరరెడ్డి మాట్లాడుతూ స్వాతంత్రోద్యమ ఆశయాలు నానాటికి దిగజారి పోతున్నాయని,ఓటు బ్యాంకు రాజకీయాలతో భారత రాజ్యాంగ లక్ష్యాలు దిగజారిపోయాయన్నారు.భారత రాజ్యాంగ లక్ష్యాలు పరిరక్షణ నేటి కర్తవ్యమనే కరపత్రాలను ఆవిష్కరించారు. ప్రజాస్వామ్యం,సెక్యులరిజం, సామ్యవాదం, సామాజిక న్యాయం ఫెడరలిజం,తదితర అంశాలపై నాయకులు చర్చించారు. ఈ సమావేశంలో చీరాల సీనియర్ సిటిజన్స్ అసోసియేషన్ అధ్యక్షులు గాదె హరిహరరావు,అసోసియేషన్ కార్యదర్శి అత్తలూరి రామారావు, చీరాల అభివృద్ధి వేదిక నాయకులు కూరపాటి నారాయణ, ఊటుకూరు వెంకటేశ్వర్లు, ఘంటసాల చైతన్య వేదిక గాయని గాయకులు డి.నిర్మలమ్మ,ఏ కళ్యాణి, పల్లపోలు నాగ మనోహర లోహియా, జ్యోతి,రమేష్, టి.ఆదిశేషు పాల్గొన్నారు.

ఎమ్మెల్యే ఏలూరి విస్తృత పర్యటన

విశాలాంధ్ర - యద్దనపూడి : మండలంలోని పోలూరు గ్రామంలో పర్చూరు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు విస్తృతంగా పర్యటించారు.ఈ సందర్భంగా గ్రామంలో టిడిపి నాయకులు రావిపాటి సీతయ్య కుమారుడు శ్రీకాంత్‌కు ప్రమాదం జరగగా పరామర్శించారు.గ్రామానికి చెందిన నెప్పాలి గంగాధర్, పెంట్యాల సాంబశివరావు, నాగబోయిన రాజు,తండ్రి సత్యనారాయణను, అమరినేని శ్రీనివాసరావును పరామర్శించారు.పోలూరు సుబ్బయ్య, పోతినేని వెంకటేశ్వర్లు కుటుంబ సభ్యులను పరామర్శించారు. నంగినేని అప్పారావు కుమారుడు సతీష్ నూతన దంపతులను ఆశీర్వదించారు. అనంతరం గ్రామ టిడిపి నాయకులతో సమావేశమై పార్టీ బలోపేతానికి అందరూ కృషి చేయాలని,నూతన ఓటర్ లిస్టును పరిశీలించి మరల లేని ఓట్లను నమోదు చేయాలన్నారు. గ్రామ టిడిపి నాయకులు కామేపల్లి హరిబాబు,నలపనేని రంగయ్య చౌదరి, కసపర్తి నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థినికి ఆర్థిక సాయం

విశాలాంధ్ర - చీరాల రూరల్ : రోటరీ క్లబ్ ఆఫ్ చీరాల ఆధ్వర్యంలో విజయవాడలోని భవిష్య ఎడ్యుకేషన్ అకాడమీలో ఇంటర్మీడియేట్ ద్వితీయ సంవత్సరం చదువుతున్న చీరాల నివాసి అందె దీపిక ఫీజు నిమిత్తం రూ.25 వేలు ఆర్థిక సాయాన్ని రోటరీ క్లబ్ సభ్యులు అందించారు.రోటరీ సామాజిక భవనంలో నిర్వహించిన ఈ కార్యక్రమంలో వక్తలు మాట్లాడుతూ విద్యాభ్యాసం పూర్తి చేసుకుని జీవితంలో ఉన్నత స్థాయికి చేరుకోవాలని ఆకాంక్షించారు.ఈ కార్యక్రమంలో మామిడాల శ్రీనివాసరావు,చీరాల కృష్ణమూర్తి,పోలుదాసు రామకృష్ణ,బండారుపల్లి హేమంత్ కుమార్,ఐ.బాబూరావు, ఎస్.వీ స్వామి, జి.వై ప్రసాద్,శివాంజనేయ ప్రసాద్, రోటరీ సభ్యులు, విద్యార్థిని తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా నారా లోకేష్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర - పిట్టలవానిపాలెం : టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ జన్మదిన వేడుకలను మంగళవారం మండలంలోని చందోలు మెయిన్ సెంటర్లో చందోలు టీడీపీ నాయకులు,కార్యకర్తల ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కేకును వారు కట్ చేసిన నారా లోకేష్‌కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. నారా లోకేష్ ఆధ్వర్యంలో ప్రతి ఒక్క కార్యకర్త సైనికుడిలా పనిచేసి తెలుగుదేశం పార్టీనీ బలోపేతం చేయాలన్నారు. యువగళం పాదయాత్రతో ప్రజల మన్ననలు పొందిన గొప్ప యువనాయకుడు నారా లోకేష్ అని వారు కొనియాడారు. టీడీపీ మండల కన్వీనర్ ఎండి అష్ఫల్, యువనాయకులు నిజాం, టీడీపీ నాయకులు మీరా,గ్రామ పార్టీ అధ్యక్షుడు రజాక్, ఫెదరిక్ పాల్గొన్నారు.

ప్రజా సమస్యలు తెలుసుకున్న లోకేష్

విశాలాంధ్ర - చీరాల రూరల్ : తెలుగుదేశం పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ జన్మదిన వేడుకలు స్థానిక తెదెపా కార్యాలయంలో ఇంఛార్జి ఎం.ఎం కొండయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు.కేక్ కట్ చేసి శుభాకాంక్షలు తెలిపారు. మాట్లాడుతూ యువగళం పాదయాత్రతో ప్రజల సమస్యలు తెలుసుకుని రానున్న తెదెపా ప్రభుత్వంలో వాటిని పరిష్కరించే దిశగా ప్రణాళికలు అమలుపరిచి ప్రజల హృదయాలలో సుస్థిర స్థానాన్ని లోకేష్ పొందనున్నారన్నారు. అనంతరం వేటపాలెంలో సజ్జా వెంకటేశ్వరరావు సహకారంతో లోకేష్ జన్మదిన వేడుకలు ఘనంగా నిర్వహించారు. కేక్ కటింగ్ చేసి అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. బీసీ సెల్ ఆధ్వర్యంలో నిర్వహించిన లోకేష్ జన్మదిన వేడుకల కార్యక్రమంలో పాల్గొన్నారు. పట్టణంలో బాబు ష్యూరిటీ భవిష్యత్తు గ్యారంటీ ఇంఛార్జిగా ఉసురుపాటి సురేష్‌ను నియమించారు. ఈ కార్యక్రమాల్లో పరిశీలకులు నాతాని ఉమా మహేశ్వరరావు, యువనాయకులు ఎం.గౌరీ అమర్ నాథ్, అధిక సంఖ్యలో తెదెపా నాయకులు, కార్యకర్తలు, మహిళలు తదితరులు పాల్గొన్నారు.

ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన అవసరం

విశాలాంధ్ర - బాపట్ల టౌన్ : ట్రాఫిక్ నిబంధనలపట్ల ప్రతి ఒక్కరు అవగాహన పెంపొందించుకుని రహదారి భద్రతను పాటించి సురక్షిత ప్రయాణం కొనసాగించి క్షేమంగా గమ్యం చేరాలని బాపట్ల మోటారు వాహన తనిఖీ అధికారి డివివి రంగారావు అన్నారు.మంగళవారం 35వ జాతీయ రహదారి భద్రత మాసోత్సవాల సందర్భంగా పురపాలక సంఘం కౌన్సిల్ హాల్లో వార్డు వాలంటీర్లు సచివాలయ సిబ్బందికి ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు.జిల్లా మోటారు వాహన తనిఖీ అధికారి చంద్రశేఖరరెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన రహదారి భద్రతపై అవగాహన కార్యక్రమంలో రంగారావు మాట్లాడుతూ ఈనెల 20 నుండి ఫిబ్రవరి 19వరకు రహదారి భద్రత మాసోత్సవాలు నిర్వహించడం జరుగుతుందన్నారు.రోడ్డు ప్రమాదాల నివారణకు ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలు పాటించి ప్రయాణాలు కొనసాగించాలన్నారు.పరిమిత వేగంతో ప్రయాణించి సురక్షితంగా గమ్యం చేరాలన్నారు. అతివేగంగా ప్రయాణించి ప్రాణాలు పోగొట్టుకొనే దుస్థితి తెచ్చు కోవద్దన్నారు. కోట్లు వెచ్చించినా పోయిన ప్రాణం తిరిగి రాదన్నారు. రహదారిపై ప్రయాణించే సమయంలో క్షణం క్షణం అత్యంత జాగ్రత్తతో అప్రమత్తంగా ఉండాలన్నారు.ప్రతి ఒక్కరూ ట్రాఫిక్ నిబంధనలపై పూర్తిస్థాయి అవగాహన కలిగి ఉండాలన్నారు. ప్రధానంగా వార్డు వాలంటీర్లు, సచివాలయ సిబ్బంది పట్టణ,గ్రామీణ ప్రాంతాల్లో ప్రజలకు ట్రాఫిక్ నిబంధనల పట్ల అవగాహన కల్పించడం వారి విధుల్లో ఒక భాగంగా చేపట్టాలన్నారు. ప్రధానంగా మైనర్లు వాహనాలు నడుపుతూ ప్రమాదం బారిన పడితే వారి తల్లిదండ్రులపై కేసు నమోదు చేసి వారికి కఠిన శిక్షలు అమలు చేయడం జరుగుతుందన్నారు. ఆటోల్లో సైతం పరిమితికి మించి ప్రయాణికులు ప్రయాణించి ప్రమాదాలకు గురికావద్దన్నారు.ప్రధానంగా యువకులు పరిమిత వేగంతో ప్రయాణించి సురక్షితంగా గమ్యం చేరాలన్నారు. అవగాహన కార్యక్రమంలో సహాయ మోటారు తనిఖీ అధికారి బి.కిషోర్ బాబు,రహదారి భద్రత వైద్యులు నరేంద్ర, వార్డ్ వాలంటీర్లు, సచివాలయ,మోటార్ వాహన తనిఖీ కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

మాట నిలబెట్టుకున్న నాయకుడు సీఎం జగన్

- ఎంపీటీసీ తాండ్ర సాంబశివరావు

విశాలాంధ్ర - కర్లపాలెం : ఇచ్చిన ప్రతి మాటను నిలబెట్టుకున్న ఒకే ఒక నాయకుడు సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి అని ఎంపీటీసీ తాండ్ర సాంబశివరావు తెలిపారు. నియోజకవర్గం కర్లపాలెం మండలం నల్లమోతువారిపాలెం గ్రామంలో జరిగిన గ్రామ స్థాయి డ్వాక్రా మహిళల సదస్సులో ఎంపీటీసీ తాండ్ర పాల్గొని గ్రామంలో డ్వాక్రా మహిళలకు నాల్గోవ విడత విడుదల చేసిన ఆసరా నిధుల గురించి మహిళలకు వివరించారు. నల్లమోతువారిపాలెం గ్రామాని ఆసరా కింద నాలుగు విడతలుగా షుమారు రూ.1,36,00000లు అందించటం సంతోషదాయ కమన్నారు.

లోకేష్ జన్మదిన వేడుకల్లో టీడీపీ నేతలు

విశాలాంధ్ర-పామూరు : టిడిపి జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ బాబు జన్మదిన వేడుకలు సందర్భంగా మంగళవారం కనిగిరి అమరావతి గ్రౌండ్ లో డాక్టర్ ఉగ్ర నరసింహ రెడ్డి ఆధ్వర్యంలో నిర్వహించిన రక్తదాన శిబిరంలో పామూరు మండలం నుండి అధిక శ్ర సంఖ్యలో యువకులు పాల్గొని రక్తదానం చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి మండల అధ్యక్షులు పువ్వాడి వెంకటేశ్వర్లు, ఎంపీటీసీ బొల్లా నరసింహారావు చౌదరి, యారవ శ్రీనివాసులు, మాజీ ఎంపీపీ గుంటుపల్లి దశరథ రామయ్య, ఇర్రి కోటిరెడ్డి, పోక వినోద్ కుమార్, ఉప్పలపాటి హరిబాబు, నరసింగు సాంబయ్య, మద్దిశెట్టి రమాదేవి, పువ్వాడి వెంకటేశ్వర్లు (బెంగళూరు)మెంటా నరసింహారావు, కౌలూరి కాజారాంతుల్ల, చిన్న హజరత్, మాండ్ల రమణయ్య తదితరులు పాల్గొన్నారు.

టీడీపీతోనే ఎస్టీల అభ్యున్నతి : ఎమ్మెల్యే ఏలూరి

ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు

విశాలాంధ్ర - మార్టూరు : తెలుగుదేశం పార్టీతోనే ఎస్టీల అభ్యున్నతి సాధ్యమవుతుందని, ఎస్టీల అభివృద్ధికి తెలుగుదేశం పార్టీ కట్టుబడి ఉందని తెదేపా బాపట్ల పార్లమెంటు అధ్యక్షులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు పేర్కొన్నారు. మంగళవారం ఎమ్మెల్యే ఏలూరి క్యాంపు కార్యాలయంలో పర్చూరు ఇందిరా కాలనీకి చెందిన 40 ఎస్టీ కుటుంబాలు ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో తెలుగుదేశం పార్టీలో చేరారు. ఆయన మాట్లాడుతూ తెదేపా ఆవిర్భావం నుంచి ఎస్టీలు వెన్నెముకగా ఉన్నారని ఆయన పేర్కొన్నారు.

ఏలూరి సమక్షంలో వలంటీర్లు చేరిక

ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో పర్చూరుకు చెందిన ముగ్గురు వాలంటీర్లు దామచర్ల నాగరాజు,మూకిరి కోటేశ్వరరావు,కుంభ రాజాలు టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు.ఎమ్మెల్యే ఏలూరి వారికి పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు.అలాగే మరో 35 కుటుంబాలు ఎమ్మెల్యే ఏలూరి సమక్షంలో దామచర్ల లింగేశ్వరరావు, దామచర్ల నాగరాజు, జయంపు రమణయ్య, రావూరి నాగరాజు,రావూరి రామాంజ నేయులు, ఏకశిరి కలగయ్య,రావూరి ఏడుకొండలు, పాలపర్తి కోటేశ్వరరావులతో పాటు పార్టీలో చేరారు.

ఘనంగా లోకేష్ జన్మదినోత్సవ వేడుకలు

టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి యువనేత నారా లోకేష్ జన్మదినోత్సవ వేడుకలు ఎమ్మెల్యే ఏలూరి ఆధ్వర్యంలో క్యాంపు కార్యాలయంలో ఘనంగా నిర్వహించారు.ఎమ్మెల్యే ఏలూరి కేక్ కట్ చేసి నాయకులు కార్యకర్తలకు పంచిపెట్టారు. ఆయన మాట్లాడుతూ యువనేత నారా లోకేష్ భావితరాల ఆశాజ్యోతి అన్నారు.టీడీపీ కార్యకర్తలకు సంక్షేమ నిధిని ఏర్పాటు చేసి అందరికీ కుటుంబ పెద్దగా పేరు ప్రఖ్యాతలు తెచ్చుకున్నారన్నారు. నేటి తరం యువతకు లోకేష్ ఒక రోల్ మోడల్‌గా నిలిచారన్నారు.

- ముందస్తుగా ఏలూరి

జన్మదినోత్సవ వేడుకలు

టీడీపీ బాపట్ల పార్లమెంట్ అధ్యక్షులు ఎమ్మెల్యే ఏలూరి సాంబశివరావు జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ముందస్తుగా మార్టూరు తెలుగు మహిళా ఆధ్వర్యంలో జన్మదినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించారు.ఎమ్మెల్యే ఏలూరి క్యాంప్ కార్యాలయానికి మార్టూరు మండల పరిధిలోని తెలుగు మహిళలు పెద్ద ఎత్తున హాజరై కేక్ కట్ చేయించారు. తెలుగు మహిళా అధ్యక్షురాలు రమాదేవి పార్లమెంటు మహిళా అధికార ప్రతినిధి రాధా, విజయ రుక్మిణి, భూలక్ష్మి, ఝాన్సీ, ముంతాజ్ సుజాత నాగ లీల,కుమారి మరియమ్మ సుజాత పాల్గొన్నారు.

ఘనంగా నారా లోకేష్ జన్మదిన వేడుకలు

విశాలాంధ్ర-గిద్దలూరు : పట్టణంలోని తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో టీడీపీ ఇంచార్జ్ ముత్తుముల అశోక్‌రెడ్డి ఆదేశాల మేరకు టీడీపీ జాతీయ ప్రధాన కార్యదర్శి నారా లోకేష్ జన్మదిన వేడుకలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. కార్యాలయంలో టీడీపీ నాయకులు కేక్ కట్ చేయడం జరిగింది. యువనేత నారా లోకేష్ నాయకత్వం వర్ధిల్లాలి అంటూ నినాదాలు చేస్తూ లోకేష్‌కి జన్మదిన శుభాకాంక్షలు తెలియచేశారు. ఈ కార్యక్రమంలో జడ్పిటిసి సభ్యులు బుడతా మధుసూదన్ యాదవ్, పట్టణ టీడీపీ అధ్యక్షులు సయ్యద్ శానేశావలి,మండల అధ్యక్షులు మార్తాల సుబ్బారెడ్డి,ప్రధాన కార్యదర్శి పందీటి రజినీబాబు,టీడీపీ కౌన్సిలర్లు భర్త బిల్లా రమేష్ యాదవ్, బూనబోయిన చంద్రశేఖర్ యాదవ్,నియోజకవర్గ ఎస్సి సెల్ అధ్యక్షులు గుర్రం దానియేలు, మైనార్టీ అధ్యక్షులు షేక్ అహ్మద్ బాషా,పార్లమెంట్ తెలుగుయువత ప్రధాన కార్యదర్శి బోయిలపల్లి కిషోర్, రాష్ట్ర మైనార్టీ కార్యదర్శి షేక్ పెద్ద మస్తాన్,టీడీపీ సీనియర్ నాయకులు గుంటక కొండయ్య యాదవ్, రాయప్రోలు సుబ్బరాయ శర్మ, మాజీ సర్పంచులు వలపపూరి ప్రసాద్,బోధనబోయిన గోపాలకృష్ణ యాదవ్,కాపు నాయకులు దుత్తా బాల ఈశ్వరయ్య, ఎలిశెట్టి వెంకటప్పు, బొజ్జా రంగనాథ్, మైనార్టీ నాయకులు షేక్ జాఫర్, బద్రి బాషా, జి.ఎం. వలి, మదూదేకుల సయ్యద్ మియా, ఖాసీంవలి, బీసీ నాయకులు కుసుమాల మహానంది యాదవ్, వేములపాటి చంటి, గిద్దలూరు మద్దిలేటి, కంచర్ల కిరణ్ గౌడ్, ప్రసాద్, గువ్వల రంగనాయకులు,గోళ్ళ విష్ణు,రాబర్ట్, మద్దిలేటి,టీడీపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

నియోజకవర్గానికి ఎవరు వచ్చినా..స్వామి లోకల్

- దామచర్ల సత్య

విశాలాంధ్ర-పొన్నలూరు : కొండపి నియోజకవర్గ పరిధిలో వైసీపీ వైసీపీ పార్టీకి నాయకులు వస్తుంటారు.. పోతుంటారు ... కానీ ఎమ్మెల్యే స్వామి లోకల్ అని టీడీపీ రాష్ట్రకార్యనిర్వాహక కార్యదర్శి దామచర్ల సత్య అన్నారు. టీడీపీ జాతీయ కార్యదర్శి నారా లోకేష్ జన్మదినాన్ని పురస్కరించుకుని పొన్నలూరులోని ఎన్టీఆర్ కూడలిలో గురువారం ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ఆయన ఎమ్మెల్యే స్వామితో కలిసి పాల్గొన్నారు. ముందుగా ఎన్టీఆర్ కూడలిలో ఉన్న విగ్రహాలకు పూలమాలలు వేసి నివాళు లర్పించారు. ఈ సందర్భంగా సత్య మాట్లాడుతూ రాష్ట్ర భవిష్యత్తు కోసం తెలుగుదేశం జేనసేన కూటమిని గెలిపించాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. వైసీపీ పార్టీలో అభ్యర్థులుగా నేతలు మారుతున్నారు తప్ప నియోజకవర్గ ప్రజలకు ఒరిగిందేమి లేదన్నారు. జగన్మోహన్‌రెడ్డి చేస్తున్న అరాచక పాలనలో అన్ని వర్గాల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొంటున్నారన్నారు. సంక్షేమ ముసుగులో దోపిడికి తెరలేపిన ముఖ్యమంత్రిగా సీఎం జగన్మోహన్ రెడ్డి ఖ్యాతి సాధించారని ఎద్దేవా చేశారు. ఎమ్మెల్యే స్వామి మాట్లాడుతూ వైసీపీ ఇంచార్జి గా భాధ్యతలు చేపట్టిన మంత్రి నియోజకవర్గంలో ఎమ్మెల్యే స్వామి ఎం చేసారని అడుగుతున్నారని.... దానికి బదులుగా మంత్రిగా నువ్వు తిరిగే రోడ్లు అన్ని తెలుగుదేశం పార్టీ హయాంలో వేసినవేనని గుర్తుచేశారు. గతంలో ఎస్సి ఎస్టీల సంక్షేమం కోసం తెలుగుదేశం పార్టీ ఎన్నో సంక్షేమ కార్యక్రమాలు చేపడితే జగన్మోహన్‌రెడ్డి అధికారంలోకి వచ్చాక తొలగిస్తుంటే మంత్రి గా ఉండి ఎం చేశావ్ అని నిలదీశారు. ఇప్పటికైనా తెలుగుదేశం పార్టీ తరపున చాలంజ్ చేస్తున్నాం గతంలో తెలుగుదేశం పార్టీ అనుమ తులు ఇచ్చి అసంపూర్తిగా ఉన్న పనులు పూర్తి చేసే సత్తా అయినా మంత్రిగా నిర్వర్తించే దమ్ముందా అని అడిగారు. పేద ప్రజల సంక్షేమం అభివృద్ధి కేవలం తెలుగుదేశం పార్టీతోనే సాధ్యం అని ఎమ్మెల్యే తెలిపారు. రాబోయే ఎన్నికల్లో తెలుగుదేశం పార్టీ - జేనసేన కూటమి ప్రభంజనం సృష్టించడం ఖాయం చంద్రబాబు నాయుడు ముఖ్యమంత్రి గా రావడం తథ్యం అని అన్నారు. అనంతరం ప్రజలకు కార్య కర్తలకు అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు అనుమోలు సాంబశివరావు, మాజీ అధ్యక్షులు మండవ ప్రసాద్ తోపాటు పలు గ్రామాల మాజీ ఎంపీటీసీలు, మాజీ సర్పంచ్‌లు, అన్ని గ్రామాల తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు దామచర్ల కుటుంబ అభిమానులు పాల్గొన్నారు.

'సృజనాత్మక రచన' గ్రంథావిష్కరణ

విశాలాంధ్ర-ఒంగోలు : డిగ్రీ ప్రథమ సంవత్సరం సెమిస్టర్-2 పేరిట ఏర్పాటు చేసిన "సృజనాత్మక రచన" గ్రంథాన్ని నాగభైరవ సాహిత్య పీఠం అధ్యక్షులు డా.నాగభైరవ ఆదినారాయణ స్థానిక ఒంగోలులోని తన కార్యాలయంలో తన చేతులు మీదగా ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ ఈ పాఠ్య గ్రంథంలో విద్యార్థులకు ఉపయోగపడే వ్యక్తీకరణ నైపుణ్యాలను, అనువాద రచనలను,మాధ్యమాలకు సంబంధించిన వివరాలను, వ్యాసరచనను, తెలుగు సాంకేతికత మొదలగు అంశాలను పాఠ్యాంశాలుగా పరిచయం చేయడం చాలా బాగుందని తెలిపారు. యుజిసి నిబంధనల మేరకు డిగ్రీ రెండవ సెమిస్టర్ లో నూతనంగా తయారు చేసిన ఈ సృజనాత్మక రచన అనే పాఠ్య గ్రంథం విద్యార్థులకు ఉపయోగ పడుతుందని, ఉద్యోగం రాకపోయినా స్వయం ఉపాధి పొందే మార్గాలను ఈపుస్తకంలో చేర్చడం సముచితంగా ఉందని డాక్టర్ నూనె అంకమ్మరావు అన్నారు. ఈకార్యక్రమంలోబి.శ్రీరామశర్మ,హరివరం మహేశ్వరాచారి, కనుమళ్ళ. శేషగిరిరావు తదితరులు పాల్గొన్నారు.

టీడీపీ వస్తేనే బలహీన వర్గాలకు న్యాయం

విశాలాంధ్ర-సీఎస్‌పురం : మండల కేంద్రమైన సీఎస్‌పురంలోని స్థానిక తెలుగుదేశం పార్టీ కార్యాలయంలో నారా లోకేష్ జన్మదిన వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుల బొమ్మనబోయిన వెంగయ్య ఆధ్వర్యంలో పార్టీ కార్యాలయంలో కేక్‌ను కట్‌చేసి అందరికీ పంచిపెట్టారు. వెంగయ్య మాట్లాడుతూ తెలుగుదేశం పార్టీ స్థాపించినప్పటి నుంచి బడుగు బలహీన వర్గాల ఉన్నతికి తెలుగుదేశం పార్టీ ఎంతో కృషి చేసిందని అన్నారు. ఈ కార్యక్రమంలో మండల తెలుగుదేశం పార్టీ ప్రధాన కార్యదర్శి మన్నేపల్లి శ్రీనివాసులు, టీడీపీ నాయకులు చినమాలకొండయ్య, పునుగుపాటి రవికుమార్, పాలపర్తి నారాయణరావు, గుంటుమడుగు వెంకటరామరాజు, పి మాల్యాద్రి, సంగిశెట్టి వెంకటేశ్వర్లు, ఆర్ వెంకటేశ్వర్లు, వి నారాయణ తదితరులు పాల్గొన్నారు.

దద్దాల స్వాగత ర్యాలీని విజయవంతం చేయండి

విశాలాంధ్ర-వెలిగండ్ల : నేడు కనిగిరి నియోజకవర్గంలో దద్దాల స్వాగత ర్యాలీని విజయవంతం చేయాలని ప్రకాశం జిల్లా జడ్పిటిసి సంఘం అధ్యక్షులు వెలిగండ్ల జడ్పిటిసి గుంటక తిరుపతిరెడ్డి కోరారు. మంగళవారం మండల ప్రజా పరిషత్ కార్యాలయంలో ఏర్పాటుచేసిన వైసిపి కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడుతూ బుధవారం కనిగిరిలోని నందన మారెళ్ళ వద్ద నుండి పవిత్ర ఫంక్షనల్ వరకు భారీ ర్యాలీ నిర్వహించడం జరుగుతుందని ఈ ర్యాలీలో నూతనంగా ఎన్నిక కాబడిన వైసిపి కనిగిరి నియోజకవర్గ ఇన్చార్జి దద్దాల నారాయణ, జిల్లా అధ్యక్షులు జంకె వెంకటరెడ్డి పాల్గొంటారని వైఎస్ఆర్‌సిపి కార్యకర్తలు అభిమానులు ప్రజలు అధిక సంఖ్యలో పాల్గొని విజయవంతం చేయాలని ఆయన కోరారు ఈ కార్యక్రమంలో మాజీ జడ్పిటిసి రామన్న తిరుపతిరెడ్డి, మాజీ సింగిల్ విండో అధ్యక్షులు, మండల సచివాలయ కన్వీనర్ పోల్లా సుబ్రమణ్యం, వైసిపి నాయకులు కటికల వెంకటరత్నం ఎంపిటిసి పాప బత్తిన నాగేశ్వరరావు, వైఎస్ఆర్‌సిపి నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.